# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 8 | ఎడిటర్ : అయితాబత్తుల రాజశేఖర్ | శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 8 28-02-2025 Friday Edirtor : AITHABATHULA RAJASEKHAR Pages : 8 Rs: 5/-




మంగళగిరి శివరాత్రి వేడుకల్లో స్వామివారి రథాన్ని లాగిన నారా లోకేశ్

- మిగతా 3 లో..

# మార్చి నుంచే.. వడగాలుల ప్రభావం

- ఇప్పుడే నిప్పులు చెరుగుతున్న భానుడు వేడి,
- ఉక్కపోతతో అవస్థలు

**రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఫిబ్రవరిలోనే భానుడు ఉగ్రరూపం దాల్చాడు. మహాశివరాత్రి తర్వాత వేడి, ఉక్కపోత మరింత పెరగనుంది. మార్చి రెండు లేదా మూడో వారంలోనే రాష్ట్రంపై వడగాలులు ప్రభావం చూపుతాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్-జూన్ మధ్యలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు భారత వాతావరణశాఖ వడగాలుల హెచ్చరికలు జారీ చేసింది.**

అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

1961-2020 మధ్యకాలంలో సేకరించిన వివరాల ప్రకారం.. మార్చి-జూన్ మధ్యలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో వడగాలుల తీవ్రత గణనీయంగా పెరిగింది.

నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 8 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో గత 30 ఏళ్లలో వడగాలుల వ్యవధి 2.5 రోజులు పెరిగింది. 2015లో విపత్తు మాదిరిగా వడగాలులు విజృంభించాయి. ఆ ఏడాది మే 23 నుంచి 27 మధ్యకాలంలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వేడి వాతావరణం నెలకొంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. 2-3 రోజుల వ్యవధిలోనే 7 నుంచి 10 డిగ్రీలు పెరిగాయి. వడగాలులు సాధారణంగా 4 నుంచి 8 రోజులుంటాయి. కోస్తాంధ్ర, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో ఆ వ్యవధి 8 రోజుల కంటే ఎక్కువే.



### అన్ని రంగాలపై ప్రభావం

కొన్నేళ్లుగా భారత్‌లో వడగాలుల ప్రభావం పెరుగుతోంది. ఇది వ్యవసాయ, రవాణా, విమానయానం, ఇలా అన్ని రంగాలను ప్రభావితం చేస్తోంది. అతి తీవ్ర వడగాలులు వీచే సమయంలో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. వ్యవసాయ రంగంలో పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయి.

### 3 నుంచి 5 డిగ్రీల పెరుగుదల

కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీలు పెరిగాయి. విశాఖ, నరసాపురం, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో 2 నుంచి 3 డిగ్రీల పెరుగుదల నమోదైంది. రాబోయే రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది. 'రాష్ట్రంలో గతేడాది ఏప్రిల్ నుంచి వడగాలుల ప్రభావం ప్రారంభమైంది. ఈసారి తీవ్రత మరింత పెరిగే అవకాశముంది. కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలకు తేమ వాతావరణం తోడు కావడంతో ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది' అని విశాఖకు చెందిన వాతావరణ నిపుణులు ఆచార్య భానుకుమార్ వివరించారు.

**ఉష్ణోగ్రతల్లో పెరుగుదల..**

ముఖ్యంగా కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో 3 నుంచి 5 డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగాయి. నరసాపురం,

2 లో..

## మహా కుంభమేళాకు 66.21 కోట్ల మంది భక్తులు..

### రూ. 3 లక్షల కోట్లకు పైగా బిజినెస్!

- జనవరి 13న ప్రారంభమై 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళా
- మహా శివరాత్రి సందర్భంగా నిన్నటితో ముగిసిన ఆధ్యాత్మిక కార్యక్రమం
- త్రివేణి సంగమం వద్ద 66.21 కోట్ల భక్తులు పుణ్యస్నానం ఆచరించారన్న సీఎం యోగి
- ముందు సుమారు 40 కోట్ల మంది భక్తులు.. దాదాపు రూ. 2 లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతాయని అంచనా
- దేశ విదేశాల నుంచి కుంభమేళాకు అపూర్వమైన స్పందన
- భారీగా తరలివచ్చిన భక్తజన సందోహం.. ఏకంగా రూ. 3లక్షల కోట్లకు పైగా బిజినెస్



యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా మహా శివరాత్రి సందర్భంగా నిన్నటితో ముగిసింది. జనవరి 13న ప్రారంభమై 45 రోజుల పాటు సాగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో 66 కోట్లకు పైగా మంది భక్తులు పుణ్యస్నానం ఆచరించినట్లు సీఎం యోగి ఆదిత్యనాథ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద 66.21 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానంలో పాల్గొన్నారని తెలిపారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అఖాడాలు, సాధువులు, మహామండలేశ్వర్ల ఆశీర్వాదంతో ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. చరిత్రలో నిలిచిపోయే ఈ మహా కుంభమేళాలో భాగమైన భక్తులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇక ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ద్వారా ఏకంగా రూ. 3లక్షల కోట్లకు పైగా బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. తద్వారా ఇది దేశంలో అతిపెద్ద ఆర్థిక కార్యక్రమాలలో ఒకటిగా నిలిచింది. కాగా, మహా కుంభమేళా ప్రారంభానికి ముందు సుమారు 40 కోట్ల మంది భక్తులు వస్తారని, దాదాపు రూ. 2 లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతాయని ప్రాథమిక

- తరువాయి 2లో..

## దాతృత్వంతో పేదరిక నిర్మూలన

- సంక్షేమంలోనూ పి4
- ఉగాది నుండి ప్రారంభం
- సమీక్షలో సిఎం

అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సంపదలో పైవరుసలో ఉన్న కుటుంబాలు తమ దాతృత్వంతో సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలకు అండగా నిలవాలని, తద్వారా పేదరిక నిర్మూలనకు సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం ఆయన సంక్షేమరంగంలో పి4 (పబ్లిక్ ఫిలాంత్రిఫిక్ పీపుల్ పార్టిసిపేషన్) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అదనంగా ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. అట్టడుగున ఉన్న వారికి మరింత చేయూతను అందించడం, పేదరికాన్ని నిర్మూలించడం ఈ



కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. పేదలను ఆదుకునేందుకు నిర్మాణాత్మకమైన, స్థిరమైన విధానం ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉగాది నుండి

- తరువాయి 2లో..

## నేడు బార్షిక బడ్జెట్

### ఉదయం ఏపీ కేబినెట్ భేటీ


అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



రేపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఇందులో భాగంగానే, రేపు (ఫిబ్రవరి 28న) ఉదయం 9 గంటలకు ఏపీ కేబినేట్ సమావేశం జరగనుంది. ఈ మంత్రి మండలి సమావేశంలో బడ్జెట్ కు ఆమోదం తెలువుతుంది. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. ఇక వ్యవసాయ బడ్జెట్ ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టనున్నారు. ఇక, కౌన్సిల్ లో మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టనుండగా.. వ్యవసాయ బడ్జెట్ ను మంత్రి పొంగూరు నారాయణ ప్రవేశ పెట్టనున్నారు.

## ఏపీలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఉపాధ్యాయ స్థానానికి 80 శాతం పైగా ఓటింగ్
- గ్రాడ్యుయేట్ స్థానాలలో 50 శాతం లోపే ఓటింగ్
- మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు
- ఓటు హక్కు వినియోగించుకున్న చంద్రబాబు, లోకేష్





అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీలో మూడు అసెంబ్లీ స్థానాలకు గురువారం పోలింగ్ జరిగింది. ఉదయం 8గంటలకు

- తరువాయి 2లో..

## అక్రమ నిర్మాణాలు, బ్యాంకు రుణాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ

**ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలతో తాజా మార్గదర్శకాలు జారీ**

**నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలి**

**అధికారులు ఎప్పటికప్పుడు బిల్డింగ్ ప్లాన్, నిర్మాణాన్ని తనిఖీ చేయాలని ఆదేశాలు**



అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అనధికార, అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని రాష్ట్రాలకు ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలతో తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. పురపాలక శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఆక్యుపేషన్ సర్టిఫికెట్‌పై భవన యజమానుల వద్ద అండర్ టేకింగ్ తీసుకోవాలి. ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఉంటేనే భవనాల్లోకి వచ్చేలా చూడాలి. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్లాన్ ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు అధికారులు బిల్డింగ్ ప్లాన్, నిర్మాణాన్ని తనిఖీ చేయాలి. డీవియేషన్ సరిచేసే వరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వవద్దు. డీవియేషన్ ఉన్న నిర్మాణాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇస్తే చర్యలు తీసుకోవాలి. నివాసయోగ్య ధ్రువపత్రం ఇస్తేనే తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. అక్రమ నిర్మాణాలకు ట్రేడ్, బిజినెస్ లైసెన్స్‌లు జారీ చేయొద్దు. జోనల్ ప్లాన్‌లోనూ డీవియేషన్ లేకుండా నిర్మాణాలు ఉండేలా చూడాలి. నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలి.

# పోసాని అరెస్టుపై స్పందించిన జగన్

## రంగంలోకి వైసీపీ లాయర్లు.. !



అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్, ఇతర నేతలపై టాలీవుడ్ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళి తీవ్ర వ్యాఖ్యలు చేసేవారు. వీటిపై కూటమి ప్రభుత్వం రాగానే ఏపీలో పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. ఇందులో అన్నమయ్య జిల్లాలో నమోదైన కేసులో పోసానిని పోలీసులు నిన్న హైదరాబాద్ లోని ఇంటికి వెళ్లి అరెస్టు చేసి తీసుకొస్తున్నారు. ఇవాళ ఆయన్ను కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్ కు తరలించేందుకు రంగం సిద్దం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోసాని అరెస్టుపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ స్పందించారు. పోసాని కృష్ణమురళి అరెస్ట్ ను జగన్ ఖండించారు. అరెస్ట్ నేపథ్యంలో హైదరాబాద్ లోని ఆయన భార్య పోసాని కుసుమలతకు ఫోన్

- తరువాయి 2లో..

## శ్రీశైలం, నాగార్జున సాగర్ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

### ఏపీ, తెలంగాణలకు కేఆర్ఎం

**తాగునీటికి మొదటి ప్రాధాన్యతను ఇస్తూ పంటలను దృష్టిలో పెట్టుకోవాలని సూచన**

**వినియోగ మట్టానికి 60 టీఎంసీలకు పైగా నీరు ఉందని వెల్లడి**

**ఉన్న కొద్ది నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచన**

అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లోని నీటిని ఉభయ తెలుగు రాష్ట్రాలు

- తరువాయి 2లో..




## రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10,58,893 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 5,00,963 మంది, ఒకేషనల్ 44,581 మంది హాజరు కానున్నారు. శనివారం నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్‌కు 4,71,021 మంది,



- తరువాయి 2లో..

# సంపాదకీయం

## ఆయన అనుకున్నదంతా అయ్యేనా?

ఆయుధ బలం, ఆర్థిక బలంతో ఏదైనా సాగించవచ్చునన్నట్లు వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, అదంత తేలిక కాదని నెల రోజులు తిరిగేసరికి అర్థమవుతుండాలి! అమెరికన్లతోపాటు వారి అనుయాయ పశ్చిమ దేశాలను, మొత్తం ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూ సాగుతున్న ఆయన చర్య లను, అందుకు ఎదురవుతున్న ప్రతిఘటన లను బట్టి ఈ అభిప్రాయం కలుగుతున్నది.

అధ్యక్షుని ప్రకటనలను, చర్యలను రెండు విధాలుగా విభజించాలి. అంతర్గతమైనవి, విదేశాంగపరమైనవి. అంతర్గతంగా అన్నీ ఇప్పటికి తను కోరుకున్న విధంగానే జరిగిపోతున్నాయి. కొన్ని చర్యల వల్ల తమ వ్యవసాయ, పారిశ్రామిక, సర్వీస్ రంగాలపైన, గృహావస రాలపైన, సామాజిక సంబంధాలపైన ప్రభావాలు మొదలైనా, నిర సనలు మంద్ర స్థాయిలోనే ఉన్నాయి.

ప్రతిపక్షమైన డెమోక్రాట్లలో చలనమే లేదు. ట్రంప్‌కు అడ్డుపడటమంటూ ఏమైనా జరిగితే అది కోర్టుల స్టే ఉత్తర్వుల వల్లనే. నష్టపోతున్న వారిలో ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా), 'అమెరికా ఫస్ట్' నినాదాలకు ఆకర్షితులై భారీగా ఓటు చేసిన తరగతుల వారు కూడా ఉన్నారనీ, వారికి ఇప్పటికే పనులూ, ఫెడరల్ ఉద్యోగాలు పోతుండటం, ధరల పెరుగు దల వంటి సమస్యలు ఎదురవుతున్నాయనీ వార్తలు చెప్తున్నాయి. ఆ వర్గాల నుంచి వ్యతిరేకత పెరిగితే తప్ప ట్రంప్ తన అంతర్గత విధా నాలను సవరించుకోకపోవచ్చు.

బయటి నిరసనలు

అంతర్గతంగా ఎట్లున్నా, బయటి ప్రపంచానికి విదేశాంగ విధానాలే ప్రధానమవుతాయి. విదేశాంగ విధానాలకు మూలం ఆంతరంగిక పరిస్థితులు, ప్రయోజనాలతో ఉండటం నిజమే అయినా, బయటివారికి ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చేది ముఖ్యమవుతుంది. ఆ విధంగా చూసినపుడు ఈ 40 రోజులలో కనిపిస్తున్నది ఏమిటి?

ట్రంప్ మొదట చేసిన భౌగోళిక సంబంధమైన ప్రకటనలు పనామా కాలువ స్వాధీనం, గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరు గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చటం, గ్రీన్‌ల్యాండ్ ఆక్రమణ, కెనడాను ఆర్థిక ఒత్తిడితో అమె రికాలో విలీనం చేసి 51వ రాష్ట్రంగా మార్చటం. ఈ అంశాలలో జరి గిందేమిటి? పనామా బలహీన దేశం. అయినా వారి కాలువను స్వాధీనపరచుకోలేక పోయారు.

కానీ ఆ కాలువ ద్వారా ప్రయాణించే అమెరికన్ నౌకలపై సుంకాల రద్దుకు అంగీకరించారన్నది అమెరికా చేసిన ప్రకటన. అది నిజం కాదన్నది పనామా ప్రభుత్వ ఖండన. కాలువపై చైనా నియంత్రణ ఉందన్నది ట్రంప్ ఆరోపణ కాగా, అది నిజం కాదని అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. కాకపోతే అమెరికా ఒత్తిడిని తట్టుకోలేక చైనా నిర్వహిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు నుంచి పనామా ఉపసంహరించుకున్నది. ఆ ప్రాజెక్టులో చేరిన మొట్ట మొదటి లాటిన్ అమెరికన్ దేశం పనామాయే.

అదే ప్రాంతపు మెక్సికో, తమ గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చటాన్ని బలంగా తిరస్కరించింది. ఐక్యరాజ్య సమితి గుర్తించింది కూడా పాత పేరునే. ఇపుడు ట్రంప్ కొత్త పేరు పెట్టి ఉత్తర్వులు జారీ చేసినా, యూరోపియన్ దేశాలు సైతం ఆమో దించటం లేదు. మెక్సికో ఆర్థికంగా అమెరికాపై ఎంత ఆధారపడినా ట్రంప్ నిర్ణయాన్ని ప్రతిఘటిస్తున్నది. ఆయన ఏమీ చేయలేక మౌనం వహించారు. గ్రీన్‌ల్యాండ్ మరొక బలహీన దేశం. కానీ డెన్మార్క్ పరిధిలో స్వయంప్రతిపత్తి గలది.

ట్రంప్‌కు కావలసింది అక్కడి విస్తారమైన వనరులు. ఆ ప్రాంతం కీలక ప్రదేశంలో ఉన్నందున తమ రక్షణ వ్యూహాలకు అవసరం. కానీ అమెరికాకు అమ్మకం అయేందుకు గ్రీన్‌ల్యాండ్, డెన్మార్క్ సమ్మతించలేదు. డెన్మార్క్ యూరప్ దేశమైనందున మొత్తం యూరప్ కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. గ్రీన్‌ల్యాండ్‌లో ఇప్పటికే అమెరికా సైనిక స్థావరాలు ఉన్నందున వాటి విస్తర ణకు, సహజ వనరులపై ఒప్పందాలకు మాత్రం గ్రీన్‌ల్యాండ్ రాజీ పడుతున్న సూచనలున్నాయి. యూరప్ మద్దతు లేనట్లయితే ఆ చిన్న దేశంపై ట్రంప్‌దే రాజ్యమయ్యేది.

అమెరికాకు సరిహద్దున ఉండటమేగాక అన్నివిధాలైన సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, ట్రంప్ అంటున్న 51వ రాష్ట్రపు మాటను కెనడా ఛీత్కరిస్తున్నది. 25 శాతం సుంకాలకు బెదరక అదే స్థాయిలో ఎదురు సుంకాలు ప్రకటించింది. ప్రజలలో జాతీయాభిమానం ఎగసి రాగా వారు అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలును తగ్గించి వేస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. బలమైన మద్దతుగల గ్రీన్‌ల్యాండ్ వలెనే, స్వయంగా బలమైన కెనడా విషయంలోనూ ట్రంప్ స్వేచ్ఛా ధోరణి నెరవేరటం లేదన్నమాట.

బుల్‌డోజర్ పథకం సాగేనా?

ఇంచుమించు ఇటువంటిదే గాజా విషయం. పాలస్తీనా, ఇజ్రాయెల్ రెండు స్వతంత్ర దేశాలు కావాలన్న అమెరికా విధానంలో నిజాయితీ లేకున్నా నోటి మాటగా అంటూ వస్తూ, ఇపుడు తిరిగి అధికారానికి వచ్చినాక దానిని అకస్మాత్తుగా వదలివేసిన ట్రంప్, గాజాను తామే ఆక్రమించి బీచ్ రిసార్టుగా మారుస్తామన్నారు. ఆ రియల్ ఎస్టేట్ మాటను పాలస్తీనియన్లే గాక మొత్తం అరబ్ రాజ్యాలు, యూరోపియన్ యూనియన్, తక్కిన ప్రపంచం, ఐక్యరాజ్యసమితి వెంటనే కొట్టివేశాయి.

అయినప్పటికీ తన పంతం వీడని ట్రంప్, తమపై బాగా ఆధారపడి ఉన్న ఈజిప్టు, జోర్డాన్‌లను ఒత్తిడి చేసి గాజా ప్రజలను, బహుశా తర్వాత వెస్ట్ బ్యాంక్ పాల స్తీనియన్లను కూడా ఆ దేశాలకు తరలించేందుకు గట్టి ప్రయత్నాలే చేశారు. కానీ ఆయన ఎంతో ఆశలు పెట్టుకున్న ఈజిప్ట్, జోర్డాన్‌ల సొంత ఆలోచనలు ఏవైనా అక్కడి ప్రజాభిప్రాయానికి, తక్కిన అరబ్ ప్రపంచం ఆగ్రహానికి భయపడి అందుకు అంగీకరించలేదు. కీలకమైన పాత్ర వహించే సౌదీ అరేబియా వెంటనే తిరస్కరించగా, ఆ తర్వాత అరబ్ విదేశాంగ మంత్రులు, గల్ఫ్ కో ఆర్డినేషన్ కౌన్సిల్ సమావేశమై అదే వైఖరి తీసుకున్నారు.

దానితో, తాము చెప్పిన దానికన్న మెరుగైన ప్రతిపాదన ఉంటే సూచించాలని అరబ్ దేశాలను అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ఇపుడు కోరు తున్నారు. గాజా ప్రజలు తమ మాతృభూమిలోనే నివసించే విధంగా పునర్నిర్మాణ పథకాన్ని, పాలస్తీనా స్వతంత్ర దేశ పథకాన్ని అరబ్ దేశాలు ఇంచుమించు రూపొందించాయి. ఆ విధంగా అమెరికా అధ్యక్షుని బుల్‌డోజర్ ఉధృతి అక్కడ సాగబోవటం లేదు. ఈ పరి ణామాల దరిమిలా, తాము, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌ను ధ్వంసం చేయటం, లొంగ దీసుకోవటం జరగవచ్చునా అన్నది వేచి చూడ వలసిన ప్రశ్న అవుతున్నది.

ఉక్రెయిన్ విషయంలో ట్రంప్ చేస్తున్నదేమిటో రోజూ వార్తలు వెలువడుతున్నాయి. తాము, యూరప్ కలిసి ఉక్రెయిన్‌ను మూడేళ్లుగా నిలబెట్టలేక పోవటంతో, వ్యక్తిగతంగా వ్యాపార ధోరణి గల ట్రంప్ ఇప్పుడు రెండువైపుల నుంచి ప్రయోజనాలు పొందే వ్యూహం వైపు మారారు. ఉక్రెయిన్‌ను, యూరప్‌ను దారికి తెచ్చుకుని ఉక్రెయిన్‌లోని లోహాలు, ఖనిజాలను సంపాదించటంబీ బలమైన రష్యాతో ఆర్థిక, ఇతర సంబంధాల మెరుగుదల.

ఎటూ గెలవలేని యుద్ధంలో ఆ విధంగా ఉక్రెయిన్, యూరప్, తనను కాదని చేయగలిగింది కూడా లేని బలహీనులు కావటం వల్ల వారిని దారికి తేగలుగుతున్నారు. దీనినిబట్టి అర్థమయే దేమిటి? పనామా, కెనడా, గాజా, ఉక్రెయిన్, యూరప్ వంటివి వేర్వేరు విధాలైన కేసులు. మొత్తం మీద తన పాలన రెండవ నెలలో ప్రవేశించే సరికే అమెరికా అధ్యక్షుడు ఇన్నిన్ని అనుభవాలు గడించటం బహుశా మరెవరి విషయంలోనూ జరిగి ఉండదు. ఆయనతో ప్రపంచ అనుభవాలు కూడా అటువంటివే.

# వైభవంగా గాయత్రి మహాయజ్ఞం

**ప్రతీ ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలి**

**-మాజీ ఉప రాష్ట్ర పతి ఎం వెంకయ్యనాయుడు**






**అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ప్రతీ ఒక్కరు సమాజ సేవలో భాగస్వాములు కావాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు సూచించారు. జీవీఎంసీ 71వ వార్డు శ్రీరామ్ నగర్ కాలనీలో గాయత్రి చేతన కేంద్రం ఏర్పాటు చేసి దివ్య ప్రాణప్రతిష్ట,108 కుండీల గాయత్రి మహా యజ్ఞాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గాయత్రి చేతన కేంద్రీయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పాల్గొని మాట్లాడుతూ సంపాదనలో ఎంతోకొంత సమాజ సేవకోసం బడుగు బలహీనవర్గాల కోసం ఉపయోగించాలని,పరిసర ప్రాంతాలు అభివృద్ధి కోసం, భక్తి శ్రద్ధలతో కృషి చేయాలని అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు తో పాటు మనశాంతి వస్తుందని అన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకులు, వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు వెంకయ్య నాయుడును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు,టిఎస్ఎన్, టీబీకకె అధినేత టి బలరామ కృష్ణ ,నాయకులు రాజన రామారావు, గాయత్రి చేతన కేంద్రీయ కమిటీ సభ్యులు,డాక్టర్ రాజు, వానపల్లి జగ్గారావు, టెడ్లపు సతీష్, లక్ష్మణరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మొదటి పేజీ నుంచి

### మార్చి నుంచే.. వడగాలుల ప్రభావం

మచిలీపట్నం ఏరియాలో తాజాగా గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో 2 నుంచి 3 డిగ్రీల పెరుగుదల నమోదైంది. రాబోయే రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి వడగాలుల ప్రభావం ప్రారంభమైంది. ఈసారి తీవ్రత మరింత పెరిగే అవకాశముంది. కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలకు తేమ వాతావరణం తోడు కావడంతో.. ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించండి..

శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి తరచుగా నీరు తాగాలి. మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎండలో తిరగడం తగ్గించాలి. అత్యవసరమైతే గొడుగు, టోపీ, సన్ గ్లాసెస్ ఉపయోగించాలి. లేత రంగు దుస్తులు ధరించాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు వేసుకోవాలి.

ఆహారం విషయంలో..

తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. నూనెలో వేయించిన, కారంగా ఉండే ఆహారానికి దూరంగా ఉండాలి. పుచ్చకాయ కీర దోస వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు తీసుకోవాలి. ఇంట్లో చల్లని వాతావరణం ఉండేలా చూసుకోవాలి. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఉపయోగించాలి. ఇంటి కిటికీలకు లేత రంగు కర్టెన్లు వేయాలి. తరచుగా చల్లటి నీటితో స్నానం చేయాలి. శరీరాన్ని చల్లబరిచేందుకు చల్లటి తడి గుడ్డను ఉపయోగించాలి.

ఆల్కహాల్ వద్దు..

వడదెబ్బ లక్షణాలు (తల తిరగడం, వాంతులు, అధిక జ్వరం) కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా నీళ్ల బాటిల్ తీసుకెళ్లాలి. ఆల్కహాల్, కెఫిన్ అధికంగా ఉండే పానీయాలకు దూరంగా ఉండాలి. ఎక్కువ శ్రమతో కూడిన పనులు చేయకూడదు. చల్లని ప్రదేశాలలో ఉండటానికి ప్రయత్నించాలి. అలసటగా అనిపిస్తే వెంటనే విశ్రాంతి తీసుకోవాలి.

### మహా కుంభమేళాకు 66.21 కోట్ల మంది భక్తులు..

అంచనాలు ఉన్నాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) సెక్రటరీ జనరల్, బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ అన్నారు. అయితే, దేశ విదేశాల నుంచి అపూర్వమైన స్పందన కారణంగా ఏకంగా 66.21 కోట్ల భక్తులు పాల్గొన్నారు. దీంతో రూ. 3 లక్షల కోట్లకు పైగా భారీ బిజినెస్ జరిగింది. ఆతిథ్యం, వసతి, ఆహారం, పానీయాల రంగం, రవాణా మరియు లాజిస్టిక్స్, మతపరమైన దుస్తులు, పూజ, హస్తకళలు, వస్త్రాలు ఇతర వినియోగ వస్తువులు వంటి అనేక వ్యాపార రంగాలు పెద్ద ఎత్తున ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించాయి. మహా కుంభమేళా జరిగిన ప్రయాగ్‌రాజ్ మాత్రమే కాకుండా దాని పరిధిలోని 100 నుంచి 150 కి.మీ దూరంలో ఉన్న నగరాలు, పట్టణాలకు కూడా భారీ వ్యాపారం జరిగింది. ఇక ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.7,500 కోట్లకు పైగా ఖర్చు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకారం… 14 కొత్త ఫ్లైఓవర్లు, ఆరు అండర్‌పాస్‌లు, 200కి పైగా రోడ్ల విస్తరణ, కొత్త కారిడార్లు, రైల్వే స్టేషన్ల విస్తరణ, ఆధునిక విమానాశ్రయ టెర్మినల్ నిర్మాణానికి ఈ రూ.7,500 కోట్లు ఖర్చు చేశారు. అదనంగా కుంభమేళా ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా రూ.1,500 కోట్లు కేటాయించారు.

### దాతృత్వంతో పేదరిక నిర్మూలన

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. నాలుగు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు రూపొందించిన కార్యాచరణను అధికారులు సిఎంకు వివరించారు. దీనివల్ల 5,869 కుటుంబాలు లబ్ధిపొందుతాయని పేర్కొన్నారు.

**'ఆ' పి4 వేరు!**

పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్రంలో పి4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్‌షిప్) విధానాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనర్థం కార్పొరేట్లు పెట్టుబడులు పెట్టే ప్రాంతంలో ప్రజలను స్టేకహోల్డర్స్‌గా మారుస్తారు. అంటే, లాభనష్టాల్లో ప్రజలకు వాటా ఇస్తారు. ఆ మేరకు వారితో ఒప్పందం చేసుకుంటారు. ఈ పేరుతో చట్ట ప్రకారం చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని నిలిపివేసే అవకాశం కార్పొరేట్ సంస్థలకు లభిస్తుంది. రాజధాని ప్రాంతంలో జరిగిన భూసమీకరణ దీనికో ఉదాహరణ! విజన్ 2047తో పాటు వివిధ పాలసీల అమలులో భాగంగా ఈ పి4 కొనసాగుతుంది. సంక్షేమ రంగంలో పి 4 (పబ్లిక్ ఫిలాంత్రిఫిక్ పీపుల్ పార్టిసిపేషన్) అంటే ప్రభుత్వరంగం, మిగతా 7లో ప్రైవేటు రంగం, దాతృత్వ సంస్థలు కలిసి సమాజంలో కొన్ని లక్ష్యాల సాధన కోసం పనిచేస్తున్నాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిల్టీ కింద చేపట్టే కార్యక్రమాలను ఇతర దాతలు, ప్రభుత్వ సహకారంతో మరింత విస్తృతంగా చేపట్టడం దీనికో ఉదాహరణ. ఈ కార్యక్రమం ఫలితంగా సంక్షేమరంగ బాధ్యత నుండి ప్రభుత్వం క్రమేణా తప్పుకుని, దాతల, కార్పొరేట్ల విచక్షణకు వదిలివేసే అవకాశం ఉంది.

**అనుసంధానమే ప్రభుత్వ పాత్ర**

లబ్ధిదారుల ధ్రువీకరణ పూర్తయిన తరువాత సమృద్ధి బంధనమ్ ఫ్లాట్‌ఫామ్‌లో ఆయా కుటుంబాల వివరాలను పొందుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. లబ్ధి పొందాల్సిన కుటుంబాలతో సాయం చేసే కుటుంబాలను అనుసంధానించడమే ప్రభుత్వ పాత్రగా ఉండనుంది. ఎక్కడా ప్రభుత్వం నేరుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించదని, మ్యాచింగ్, ఎనర్జింగ్, ట్రాకింగ్ వరకే ప్రభుత్వ పాత్రని అధికారులు సిఎంకు వివరించారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి 5 లక్షల అభిలాషి కుటుంబాలను సమృద్ధి బంధనమ్ ఫ్లాట్‌ఫామ్ కిందకు తీసుకురావాలని ఈ సందర్భంగా సిఎం ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీనియర్ అధికారులు పియూష్‌కుమార్, కాటంనేని భాస్కర్, ప్లానింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### ఏపీలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం నాలుగు గంటలకు ముగిశాయి.. మొత్తం మూడు స్థానాలకు సుమారు 68 శాతం ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది.. కాగా టీచర్ స్థానానికి ఏకంగా 80 శాతం పైగా ఓటింగ్ నమోదు కాగా, గ్రాడ్యుయేట్ రెండు స్థానాలకు ఓటింగ్ శాతం యాభై కూడా మించకపోవడం విశేషం

**ఉపాధ్యాయ బరిలో 10 మంది..**

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గంలో పది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పోలింగ్ కోసం మొత్తం 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లు 22,493 మంది కాగా, 13,503 మంది పురుషులు, 8,985 మంది మహిళలున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఎన్నిక జరిగింది. యుటీఎఫ్ నుంచి కోరెడ్ల విజయగౌరి, ఏపీటీఎఫ్ తరపున పాకలపాటి రఘువర్మ, పీఆర్టీయూ నుంచి గాదె శ్రీనివాసులనాయుడు బరిలో ఉన్నారు.

**రెండు స్థానాలలో 64 మంది పోటీ**

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 34 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులు మధ్యనే ప్రధానంగా పోటీ కొనసాగినట్టు సమాచారం. మొత్తం 3,14,984 ఓట్లు ఉంటే.. 1,83,347 మంది పురుషులు, 1,31,618 మంది మహిళలు ఉన్నారు. 19 మంది ట్రాన్స్ జండర్స్ కూడా ఉన్నారు. మొత్తం 456 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మరోవైపు.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్య ప్రధానంగా పోటీ ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తం 3,46,529 ఓట్లు ఉన్నాయి. మొత్తం 416 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మూడు స్థానాలకు మార్చి మూడో తేదీన కౌంటింగ్ జరగనుంది.

**ఓటేసిన చంద్రబాబు, లోకేష్**

ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉండవల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వారు ఓటు వేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. "ఓటు వేయడం మన బాధ్యత. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది పెద్ద ఆయుధం. అందరూ బాధ్యతతో ఓటు వేయాల్సిన అవసరం ఉంది. ఓటు వేస్తేనే చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి నాంది పలుకుతాం" అని తెలిపారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న కేంద్రమంత్రి పెమ్మసాని ..**

ఉమ్మడి గుంటూరు కృష్ణాజిల్లాల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హై స్కూల్ లో ఓటు వేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మేధావులు, విజ్ఞానవంతులు, సమాజ శ్రేయస్సు కోరే ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు వెయ్యటానికి ఒక్క గంట సమయం వేచించాలని కోరారు. పట్టభద్రులు వేసే ఈ ఓటు విలువ 6ఏళ్ల అభివృద్ధికి ఊతమిస్తుందని గుర్తు చేశారు.

**ఓటేసిన మంత్రి నాదెండ్ల..**

తెనాలిలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పొన్నూరు జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబ సభ్యులతో కలని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు

**ఇబ్రహీంపట్నంలో ఒకరి ఓటు మరొకరు..**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ డిగ్రీ కళాశాల బూత్ నెంబర్ 45లో క్రమ సంఖ్య 331లో గుంటుపల్లికి చెందిన పాటిబండ్ల జ్ఞానదీప్తి ఓటును మరొకరు వేశారు. ఓటు వేసేందుకు వెళ్లిన ఆమె ఓటు పోలైనట్లు పోలింగ్ అధికారులు తెలపడంతో ఖంగుతిన్నారు. వెంటనే ఎన్నికల సహాయ అధికారి వై.వెంకటేశ్వర్లు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన పోలింగ్ అధికారులతో మాట్లాడారు. పోలింగ్ అధికారులు ఆమెకు చాలెంజ్ ఓటు వేసే అవకాశం కల్పించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం ఆకివీడు ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తణుకులోని బాలుర ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీసమేతంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఏలూరు జిల్లా జీలుగుమిల్లి జెడ్పీ పాఠశాలలో ఓటేశారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కాకినాడ జిల్లా తొండంగిలో ఓటేశారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కూడా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

### పోసాని అరెస్టుపై స్పందించిన జగన్ రంగంలోకి వైసీపీ లాయర్లు.. !

చేసి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోందని, ఈ అరెస్ట్ విషయంలో పోసాని కృష్ణమురళికి వైసీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో చోటు చేసుకుంటున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారని తెలిపారు. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. అలాగే పోసాని కృష్ణమురళికి వైసీపీ తరుపున న్యాయ పరంగా సహాయం అందిస్తామని ఆయన భార్యకు జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికే పార్టీకి సంబంధించిన సీనియర్ న్యాయవాదులకు ఈ వ్యవహారాన్ని అప్పగించామని జగన్ ఆమెకు తెలిపారు. ఆలోపు మనోధైర్యంతో ఉండాలని ఆమెకు సూచించారు.

### శ్రీశైలం, నాగార్జున సాగర్ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి : ఏపీ, తెలంగాణలకు కేఆర్ఎం

సమర్థవంతంగా వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. త్రాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పంటల సాగును దృష్టిలో ఉంచుకుని నీటిని వినియోగించుకోవాలని చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలోని బోర్డు నిర్ణయించింది. ఈ బోర్డు సమావేశం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇతర ఇంజినీర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో నీటి వినియోగంపై ఈ సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తెలంగాణ రాష్ట్రానికి 63 టీఎంసీల నీరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, 55 టీఎంసీల నీరు అవసరమని ఆయా రాష్ట్రాలు కోరాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు సూచించింది. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని తెలిపింది.

### రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

వొకేషనల్ 44,581 మంది ఉన్నారు. వీరికి మార్చి 3వ తేది నుంచి 20వ తేదీ వరకూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా 1535 పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసింది. ప్రతి 20 కేంద్రాలకు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించింది. ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటిని రాష్ట్ర, జిల్లా కేంద్రాల ద్వారా పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు.

## మంత్రి నారా లోకేశ్ సమక్షంలో
# స్కిల్‌బీ అవగాహన ఒప్పందం

- స్కిల్‌బీ ద్వారా నర్సింగ్ స్టూడెంట్స్ కు జర్మన్ భాషలో శిక్షణ
- ఏటా వెయ్యి మంది నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగాలు
- బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం విద్యనభ్యసించే విద్యార్థినులకు ఐరోపా దేశాల్లో ఉద్యోగావకాశాలు



**అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం విద్యనభ్యసించే విద్యార్థినులకు జర్మనీ, ఐరోపా దేశాల్లో ఉద్యోగావకాశాలు లభించేలా శిక్షణ ఇప్పించేందుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్కిల్‌బీ నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఇరుపక్షాలు ఎంఓయుపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... జర్మనీలో వృద్ధుల సంరక్షణ, ఆసుపత్రుల్లో 3 లక్షల మంది నర్సింగ్ అభ్యర్థుల కొరత ఉందని తెలిపారు. యూరప్ లో ముఖ్యంగా జర్మనీలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు గాను రాష్ట్రంలో నర్సింగ్ విద్యనభ్యసించిన విద్యార్థినులకు స్కిల్‌బీ ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ వల్ల ప్రతి ఏటా వెయ్యి మంది నర్సింగ్ విద్యార్థినులకు జర్మనీలో అత్యుత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. స్కిల్‌బీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ వింజమూరి రవిచంద్ర గౌతమ్, సీఈఓ ఉజ్వల్ చౌహాన్ మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 10వేల మందికిపైగా విదేశాల్లో ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. స్కిల్‌బీ అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ రిక్రూట్‌మెంట్ స్టార్టప్‌లలో ఒకటిగా ఉందని తెలిపారు. జర్మనీ, పోలాండ్, హంగేరీ, లిథువేనియా, లాట్వియా, ఇతర తూర్పు ఐరోపా దేశాలకు తమ సంస్థ ద్వారా అభ్యర్థులను రిక్రూట్ చేస్తున్నామని అన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ భాగస్వామ్యంతో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం స్పెషలైజేషన్ తో గ్రాడ్యుయేషన్ పొందిన నర్సులకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి, ప్లేస్ మెంట్ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. స్కిల్‌బీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఏపీఎస్ఎస్‌డీసీలు భాషా నైపుణ్య కొరతను పరిష్కరించి, ఏపీని నైపుణ్య రాజధానిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, విశాఖపట్నంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు, ఉమ్మడి తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లోని 4వేల మందికి పైగా నర్సింగ్ విద్యార్థులకు స్కిల్‌బీ ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ అండ్ ట్రైనింగ్ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, ఏపీఎస్ఎస్‌డీసీ సీఈఓ గణేశ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మనోహర్, మెడిక్రూటర్ ఎండీ రోనాల్డ్ రెస్కే పాల్గొన్నారు.





# పూర్తిస్థాయిలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి

**95శాతం పిఎల్‌ఎఫ్ సాధించిన కృష్ణపట్నం యూనిట్**
**జెన్‌కో ఎమ్‌డి చక్రధర్ బాబు**



**అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎపిజెన్‌కో యూనిట్లు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు వెల్లడించారు. 2025 జనవరి నుంచి 100 మిలియన్ యూనిట్లు(ఎంయు)పైగా స్థిర విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించిందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 123 ఎంయుల విద్యుత్ ఉత్పత్తితో సరికొత్త రికార్డు నెలకొల్పిందని పేర్కొన్నారు. శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ ((కృష్ణపట్నం) (ఎస్‌డిఎస్‌టిపిఎస్)) లోని యూనిట్–3(800 మెగావాట్లు) ప్రారంభమైన నవంబర్ 18 నుంచి నిరంతరాయంగా 100 రోజుల పాటు ఉత్పత్తి చేసి రికార్డు నమోదు చేసిందని వివరించారు. 1596.30 ఎంయులు ఉత్పత్తి చేయగా, 95శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్(పిఎల్‌ఎఫ్)తో అత్యుత్తమ సామర్థ్యాన్ని ప్రదర్శించిందని పేర్కొన్నారు. గరిష్ట ఉత్పత్తి ఈ నెల 18వ తేదిన సాధించిందని తెలిపారు. ఎస్‌డిఎస్‌టిపిఎస్ రోజుకు 45 ఎంయుల ఉత్పత్తి చేస్తోందని, జెన్‌కో థర్మల్ ఉత్పత్తిలో 40శాతం వాటా కలిగి ఉందని వివరించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు, విద్యుత్ సరఫరా అందించేందుకు జెన్‌కో కట్టుబడి ఉందని తెలిపారు. బొగ్గు నిల్వలను మరింతగా మెరుగుపరిచి నిరంతరాయంగా ఉత్పత్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ఉత్పత్తి విధానాలను అనుసరిస్తూ, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు జెన్‌కో కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సహాయ సహకారాలు, దిశానిర్దేశాలతో విద్యుత్ ఉత్పత్తిలో రికార్డులు నెలకొల్పుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్, రైతులకు 9 గంటల విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తనవంతు కృషి జెన్‌కో అందిస్తుందని తెలిపారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకునే దిశగా ప్రణాళికలు రూపొందించి, ఆ దిశగా ఉద్యోగులు, సిబ్బంది కృషి చేస్తున్నారని అభినందనలు తెలిపారు.

# చంద్రబాబు నాయుడును కలిసిన పీటీ ఉషా

**2029లో జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు అవకాశమివ్వాలని కోరిన సీఎం**
**క్రీడా విధానం, అథ్లెట్లకు శిక్షణపై చర్చించినట్లు వెల్లడి**
**స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రం కోసం మద్దతు కోరినట్లు తెలిపిన చంద్రబాబు**



**అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష సమావేశమయ్యారు. 2029లో ఆంధ్రప్రదేశ్ జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని ఆమెను కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా వెల్లడించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పీటీ ఉషతో నూతన క్రీడా విధానం, అథ్లెట్లకు శిక్షణపై చర్చించినట్లు ముఖ్యమంత్రి 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని తీసుకురావడంలో పీటీ ఉష సహకారం కోరినట్లు ఆయన పేర్కొన్నారు. అమరావతిలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు, స్పోర్ట్స్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు అవకాశాలు కల్పించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## మంగళగిరి శివరాత్రి వేడుకల్లో
# స్వామివారి రథాన్ని లాగిన నారా లోకేశ్

- భక్తులతో కలిసి స్వామి వారి రథాన్ని లాగిన నారా లోకేశ్
- గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వేడుకలు
- 200 మీటర్ల మేర రథాన్ని లాగిన నారా లోకేశ్



**అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలో జరిగిన శివరాత్రి వేడుకల్లో భక్తులతో కలిసి స్వామివారి రథాన్ని లాగారు. గుంటూరు జిల్లాలోని మంగళగిరిలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలను నిర్వహించారు. ఇక్కడ జరిగిన రథోత్సవంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. స్వామి వారి రథం వద్ద మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ తర్వాత భక్తులతో కలిసి 200 మీటర్ల దూరం రథాన్ని లాగారు.

**లోకేశ్ ట్వీట్**

శివరాత్రి వేడుకల్లో భాగంగా మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవంలో పాల్గొన్నానని లోకేశ్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. భక్తుల శివనామ స్మరణ, అశేష జనసందోహం మధ్య రథాన్ని లాగానని పేర్కొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. అనంతరం కృష్ణాయపాలెంలోని అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవంలో పాల్గొన్నానని తెలిపారు. విశ్వేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. వేద పండితులు తనకు ఆశీర్వచనాలు అందించారని, స్థానికులతో కలిసి ఫోటోలు దిగానని పేర్కొన్నారు.





## గోరంట్ల మాధవ్‌కు
# పోలీసుల నోటీసులు

**అంతర్యుద్ధం రాబోతోందని మాజీ ఎంపీ ఆగ్రహం**



**అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ కు విజయవాడ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మాజీ మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మార్చి ఐదో తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఓ పోక్సో కేసులో బాధితురాలి పేర్లను బయట పెట్టడమే కాకుండా అసభ్యంగా మాట్లాడారు. ఈ మాటల వీడియోలతో సహా వాసిరెడ్డి పద్మ గత నవంబర్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నోటీసులను అందుకున్న గోరంట్ల మాధవ్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛ లేదని.. ప్రశ్నించిన వారందరిపై అరెస్టులు చేసి కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. త్వరలో రాష్ట్రంలో అంతర్యుద్ధం వస్తుందని హెచ్చరించారు. తనకు ఈ నోటీసులు ఇప్పుడే ఇచ్చారని.. ఐదో తేదీన విచారణకు వెళ్లడంపై ఆలోచిస్తానన్నారు. న్యాయ నిపుణుల సలహా తీసుకుంటానని .. వారి సలహా మేరకు నడుచుకంటానన్నారు. విచారణ తేదీ మార్చాలని కూడా అడుగుతానన్నారు. తాను ఏ తప్పు చేయలేదని.. రాష్ట్రంలో జరుగుతున్న ఘోరాలను ప్రశ్నించినందుకే తనపై కేసులు పెడుతున్నరని గోరంట్ల ఆరోపించారు.

**జగన్ పిలిచి వైసీపీ టిక్కెట్**

కాగా, గోరంట్ల మాధవ్ సీఐగా పని చేస్తూ రాజకీయాల్లోకి వచ్చారు. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అనంతపురంలో సీఐగా పని చేస్తున్న సమయంలో జేసీ దివాకర్ రెడ్డి పోలీసులపై చేసిన కొన్ని వ్యాఖ్యలతో ఆయన ప్రెస్ మీట్ పెట్టారు. పోలీసు అధికారుల సంఘం అని చెప్పుకుని ఆయన మీసాలు మెలేసి..తొడలు కొట్టి హైలెట్ అయ్యారు. ఆయన సామాజికవర్గం కూడా కలసి రావడంతో జగన్ పిలిచి వైసీపీ టిక్కెట్ ఇచ్చారు. వైసీపీ గాలిలో ఎంపీగా గెలిచారు.

## పోసాని కృష్ణ మురళి భార్యను
# పరామర్శించిన జగన్

**పోసాని భార్య కుసుమలతకు ఫోన్ చేసిన జగన్**
**పోసానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పిన వైసీపీ అధినేత**
**పొన్నవోలుతో పాటు పలువురు వైసీపీ నేతలను కోర్టు వద్దకు పంపించామని వెల్లడి**



**అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో సినీ నటుడు పోసాని కృష్ణమురళిని ఏపీ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ లోని నివాసంలో పోసానిని అరెస్ట్ చేసిన పోలీసులు... అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్నారు. పోసాని అరెస్ట్ నేపథ్యంలో ఆయన భార్య కుసుమలతకు వైసీపీ అధినేత జగన్ ఫోన్ చేసి పరామర్శించారు. పోసానికి పార్టీ అండగా ఉంటుందని ఆమెకు ధైర్యం చెప్పారు. 'దేవుడు అంతా చూస్తున్నాడు. మీరు ధైర్యంగా ఉండండి. మీకు అందరం తోడు ఉంటాం' అని తెలిపారు. పొన్నవోలు సుధాకర్ రెడ్డి సహా పార్టీ నాయకులందరినీ కోర్టు వద్దకు పంపించామని చెప్పారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన ఎక్కువ రోజులు కొనసాగదని చెప్పారు. జనసేన నేత జోగిమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓబులవారిపల్లె పీఎస్ లో పోసానిపై కేసు నమోదయింది. 196, 353 (2), రెడ్ విత్ 3 (5) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

## ముగిసిన వల్లభనేని వంశీ
# 3 రోజుల కస్టడీ..



**అమరావతి ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పోలీసు కస్టడీ ముగిసింది. వంశీని విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించిన సంగతి తెలిసిందే. కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో వంశీని పోలీసులు విచారించారు. ఈరోజు విచారణ ముగిసిన అనంతరం వంశీని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. కాసేపట్లో ఆయనను జైలుకు తరలించనున్నారు. వంశీతో పాటు మరో ఇద్దరు నిందితులు లక్ష్మీపతి, శివరామకృష్ణను పోలీసులు విచారించారు. సత్యవర్ధన్ కిడ్నాప్ లో ఎవరి ప్రమేయం ఉందనే దానిపై ఆరా తీశారు. వంశీ చెపితేనే సత్యవర్ధన్ ను తీసుకెళ్లామని వారు చెప్పినట్టు సమాచారం. మరోవైపు తనకేమీ తెలియదని విచారణలో వంశీ చెప్పినట్టు తెలిసింది. తన మూడు ఫోన్లు ఎక్కడున్నాయనే దానిపై కూడా తనకు తెలియదని వంశీ చెప్పినట్టు సమాచారం.

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

శుక్రవారం 28 ఫిబ్రవరి 2025


# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే అయితాబత్తుల

















అమలాపురం నియోజకవర్గం, ఉప్పలగుప్తం మండలంలోని 244 బూత్ లో ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుట్ ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న గౌరవ శాసనసభ్యులు శ్రీ అయితాబత్తుల ఆనందరావు

అమలాపురం, ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

### అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రశాంతంగా

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జేసీ నిశాంతి, డి.ఆర్.ఓ రాజకుమారి**

**- సాయంత్రం 4 గంటల వరకు 67.30 శాతం పోలింగ్**

అమలాపురం, ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బుధవారం అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన 95 పోలింగ్ కేంద్రాల్లో ఉదయ 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పోలింగ్ నిర్వహించారు. జిల్లాలో 37,114 మంది పురుషులు, 27,355 మంద మహిళలు, ఇద్దరు థర్డ్ జెండర్ పట్టభద్రులైన ఓటర్లు ఉండగా సాయంత్రం 4గంటల వరకు 67.30 శాతం పోలింగ్ నమోదైందని కంట్రోల్ రూమ్ అధికారులు తెలిపారు. అమలాపురం తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 213 పోలింగ్ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సందర్శించి పోలింగ్ నిర్వహణను పర్యవేక్షించారు. అదే విధంగా పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలలో పర్యటించి పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ప్రచారాలు నిర్వహించరాదని వ్యక్తులు గుంపులుగా సంచరించకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఓటింగ్ శాతం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వానికి తావు లేకుండా అప్రమత్తంగా సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎస్.కే.వి.ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 215, 216, 217 పోలింగ్ కేంద్రాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన 222 ,215 పోలింగ్ కేంద్రాలను జిల్లా రెవెన్యూ అధికారి, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి బి.ఎల్.ఎన్ రాజకుమారి సందర్శించారు. ఓటింగ్ నిర్వహణ తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే సత్యప్రభ, మెట్ల రమణబాబు గంటా నూకరాజు



ప్రత్తిపాడు, ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయాన్ని ఆకాంక్షిస్తూ, కాకినాడ జిల్లా పత్తిపాడు నియోజకవర్గం, పత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి ఏలేశ్వరం మండలాలలో పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే గౌ.శ్రీ. వరుపుల సత్యప్రభ రాజా, నియోజకవర్గం పరిశీలకులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ మెట్ల రమణబాబు, మరొక పరిశీలకులు గంటా నూకరాజు సందర్శించారు. ఓటింగ్ సరళి పరిశీలించిన నేపథ్యంలో పోలింగ్ నిర్వహణపై ఈరోజు ప్రతిపాడు నియోజకవర్గం లో జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు మరియు స్థానిక ఎన్డీఏ కూటమి శ్రేణులు కార్యక్రమం లో పాల్గొన్నారు...



### కుటుంబం సహా ఓటు హక్కు వినియోగించుకున్న

## మెట్ల రమణబాబు



అమలాపురం, ఫిబ్రవరి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం విజయాన్ని ఆకాంక్షిస్తూ, అమలాపురం ఎస్.కే.బి.ఆర్. కాలేజ్ ఆవరణలో పోలింగ్ స్టేషన్ 216లో తమ కుటుంబ సభ్యులు శ్రీమతి శేషవేణి, తనయుడు సత్య గార్లతో ఓటు హక్కు వినియోగించుకున్న, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి, పత్తిపాడు నియోజకవర్గం పరిశీలకులు శ్రీ మెట్ల రమణబాబు...



# పౌరులందరికీ పింఛను!

## అసంఘటిత కార్మికులకు, గిగ్ వర్కర్లకూ వర్తింపు కేంద్రం యోచన




**దిల్లీ: ప్రజలందరికీ వర్తించేలా ఒక పింఛను పథకాన్ని తీసుకువచ్చేందుకు కేంద్రం యోచిస్తోంది. అవసరమైతే ప్రస్తుతం ఉన్న కొన్ని పథకాలను విలీనం చేసి.. అసంఘటిత రంగంలోని కార్మికులకూ వర్తించేలా ప్రభుత్వం దీనిని తీసుకురానుందని కార్మిక-ఉపాధి కల్పన శాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. నిర్మాణరంగ కార్మికులు, ఇళ్లలో పనులు చేసేవారు, గిగ్ వర్కర్లు వంటివారికి ప్రభుత్వ నిర్వహణలోని కొన్ని పథకాలు అందడం లేదు. కొత్తగా రాబోయే సార్వత్రిక పథకం.. ఇలాంటివారితోపాటు స్వయం ఉపాధి పొందుతున్నవారికీ వర్తించనుంది.**

అసంఘటిత రంగంలో పనిచేసేవారి కోసం అటల్ పెన్షన్ యోజన, వీధి వ్యాపారుల కోసం ప్రధాన మంత్రి శ్రమయోగి మాన్‌ధన్ యోజన, రైతులకు ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన వంటివి ప్రస్తుతం ఉన్నాయి. పదవీ విరమణ తర్వాత నెలకు రూ.వెయ్యి నుంచి రూ.3,000 వీటికింద అందుకునేందుకు పౌరులు నెలవారీగా రూ.55-రూ.200 వరకు చెల్లిస్తుండగా.. ప్రభుత్వం అంతే మొత్తాలను జమచేస్తోంది. ఇలాంటి పథకాలను క్రమబద్ధీకరించి.. పౌరులెవరైనా స్వచ్ఛందంగా కొంత మొత్తాలు చొప్పున జమ చేసుకుని 60 ఏళ్ల వయసు తర్వాత పింఛను పొందేలా సురక్షితమైన, ఒకే తరహా పథకాన్ని అందుబాటులోకి తేవాలని కేంద్రం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ పింఛను పథకాలను విలీనం చేస్తామంటే కేంద్రం ప్రోత్సహించనుంది. దానివల్ల పింఛను పెరగడంతోపాటు ఏదో ఒకచోటే లబ్ధి పొందడం వీలవుతుందని భావిస్తోంది. 'భవనాలు, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం' కింద వసూలు చేసిన సెస్సును నిర్మాణరంగ కార్మికుల పింఛన్ల కోసం ఉపయోగించుకోవాలని చూస్తోంది.

చైనా, అమెరికా, కెనడా, రష్యా తదితర దేశాలు పింఛన్లను, ఆరోగ్య పరిరక్షణను, నిరుద్యోగులకు ప్రయోజనాలను కల్పించే సామాజిక భద్రత వ్యవస్థల్ని తీర్చిదిద్దాయి. ఇలాంటి తరహాలోనే అసంఘటిత రంగ కార్మికులే కాకుండా వ్యాపారులు, నిరుద్యోగులు.. ఇలా ఎవరైనా పింఛను ప్రయోజనాలు పొందేందుకు మనదేశ సార్వత్రిక పథకం వీలు కల్పించనుంది. ఈ కొత్త పథకంపై 'ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ' (ఈపీఎఫ్‌వో) కసరత్తు చేస్తోంది. జాతీయ పింఛను పథకం (నేషనల్ పెన్షన్ స్కీమ్-ఎన్‌పీఎస్) ఇకపైనా యథాతథంగా కొనసాగుతుందని తెలిపారు.

# మాకు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో పాక్ లేదు: భారత్

**దిల్లీ: అంతర్జాతీయ వేదికలపై తరచూ పాకిస్థాన్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కుతూనే ఉంది. తాజాగా జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో దాయాది దేశం ఆరోపించింది. ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. అంతేకాక.. మాకు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో ఆ దేశం లేదని స్పష్టం చేసింది.**




జెనీవాలో జరిగిన ఈ సమావేశంలో జమ్మూకశ్మీర్‌ను ఉద్దేశించి పాక్ న్యాయ, మానవ హక్కుల మంత్రి అజం నజీర్ తరార్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత రాయబారి క్షితిజ్ త్యాగి దీటుగా స్పందించారు. 'కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదం కారణంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలను హింసించడంతో సహా ప్రజాస్వామ్య విలువలను పాటించని దాయాది దేశం భారత్‌కు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో లేదు. ఆ దేశ వాక్‌చాతుర్యంలోనే కపటత్వం కన్పిస్తోంది. ఐరాస జాబితాలోని పలు ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తుంది. ప్రజాస్వామ్య పురోగతి, ప్రజలకు గౌరవం కల్పించడం వంటి వాటిపై భారత్ దృష్టిసారిస్తుంది. ఆ దేశం మాపై ఆరోపణలు చేయడం మానేసి.. తమ దేశంలోని ప్రజలకు సుపరిపాలనను అందించడంపై దృష్టిపెట్టాలి' అని త్యాగి పేర్కొన్నారు.

ఇక, ఇటీవల చైనా అధ్యక్షతన జరిగిన భద్రతామండలి సమావేశంలోనూ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషక్ దార్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనికి సైతం భారత్ ఘాటుగా స్పందించింది. జైషే మహమ్మద్ వంటి సంస్థలను ప్రోత్సహించే పాక్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం అత్యంత హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తంచేసింది.

# తొందర్లో ఈయూకీ వడ్డిస్తాను: ట్రంప్

**అమెరికా : అదనపు సుంకాల వడ్డనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రులను కూడా వదలడం లేదు. ఐరోపా సమాఖ్యపై త్వరలోనే 25శాతం అదనపు టారిఫ్‌లను విధిస్తానని వెల్లడించారు. అసలు ఈయూ ఏర్పడిందే అమెరికాను కట్టడి చేయడానికని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మేము ఒక నిర్ణయానికి వచ్చాము. దానిని త్వరలోనే ప్రకటిస్తాను. 25శాతం అని అనుకొంటున్నాం. అది కార్లు సహా అన్నింటిపైనా వర్తిస్తుంది. అమెరికాను బిగించడానికే ఐరోపా సమాఖ్య ఏర్పడింది. అది దాని పని బాగా చేసింది. ఇప్పుడు నేను అధ్యక్షుడిని అయ్యాను" అని పేర్కొన్నారు.**



ఈయూ ప్రస్తుతం దిగుమతి చేసుకొంటున్న కార్లపై 10శాతం టారిఫ్‌లను విధిస్తోంది. దీనికితోడు వ్యాట్, ఇతర పన్నులు కలిపి అది 17.5శాతానికి చేరుతోంది. అదే సమయంలో అమెరికా కేవలం 2.5శాతం మాత్రమే వసూలు చేస్తోంది.

ఐరోపా సమాఖ్య అమెరికాకు మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. చైనాతో కూడా అమెరికాకు ఇదే స్థాయిలో బిజినెస్ జరుగుతుంది. ఇక కెనడా, మెక్సికోలతో అమెరికా వ్యాపారం అత్యధికంగా చేస్తుంది. ఇప్పటికే ఈ మూడు దేశాలపై అదనపు సుంకాలను ట్రంప్ ప్రకటించారు. ఇవి మార్చి 4వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలు ఈయూలో కలకలం రేపాయి. యూరోపియన్ కమిషన్ స్పందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ అయిన ఈయూ అమెరికాకు వరమని పేర్కొంది. "స్వచ్ఛ, పారదర్శక వాణిజ్యానికి అన్యాయమైన అడ్డంకులపై ఈయూ తక్షణమే స్పందిస్తుంది. ఈ సుంకాలు చట్టాలను, వివక్ష రహిత విధానాలను సవాలు చేస్తాయి" అని ఈయూ ప్రతినిధి పేర్కొన్నారు.

తైవాన్‌ను ఆక్రమించుకోవడానికి చైనాకు అమెరికా అనుమతిస్తుందా..? అన్న ప్రశ్నకు ట్రంప్ సమాధానం చెప్పలేదు. ఆ సమస్యపై ఎప్పుడూ కామెంట్ చేయను అని ముక్తసరిగా బదులిచ్చారు. చైనాతో సీమాంతర పెట్టుబడుల అంశాల్లో మంచి సంబంధాలను కలిగి ఉండాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. 90శాతం యూఎస్ ఎయిడ్ కాంట్రాక్టులు రద్దు..

అమెరికా ఇతర దేశాలకు యూఎస్‌ఎయిడ్ రూపంలో అందించే సాయానికి సంబంధించిన 90శాతం కాంట్రాక్టులను రద్దు చేసింది. కోర్టు కేసుల్లో ఉన్న కొన్ని ప్రాజెక్టులు మాత్రం కొనసాగుతున్నాయి. ఈమేరకు కోర్టుకు దాఖలు చేసిన ఓ పత్రంలో పేర్కొంది.

# గగనతలం నుంచి నౌకా విధ్వంసక క్షిపణి ప్రయోగం

## భారత్ మరో ముందడుగు



**దిల్లీ:** నౌకా విధ్వంసక క్షిపణిని (ఎన్‌ఏఎస్‌ఎం-ఎస్‌ఆర్) తొలిసారిగా గగన తలం నుంచి భారత్ విజయవంతంగా ప్రయోగించింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), భారత నౌకాదళం సంయుక్తంగా చాందీపూర్ సమీకృత పరీక్ష కేంద్రం నుంచి మంగళవారం జరిపిన ఈ ప్రయోగం విజయవంతమైనట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. నౌకాదళానికి చెందిన సీ కింగ్ హెలికాప్టర్ నుంచి దీనిని ప్రయోగించినట్లు తెలిపారు. క్షిపణికి చెందిన మ్యాన్-ఇన్-లూప్ ఫీచర్‌ను ఈ ప్రయోగం నిరూపించిందని, గరిష్ఠ పరిధితో సీ స్కిమ్మింగ్ మోడ్‌లో చిన్న నౌక లక్ష్యాన్ని నేరుగా చేరుకుందని వివరించారు. టెర్మినల్ గైడెన్స్ కోసం ఈ క్షిపణి దేశీయ ఇమేజింగ్ ఇన్‌ఫ్రా రెడ్‌ను ఉపయోగించుకుందని తెలిపారు. అత్యధిక బ్యాండ్‌విడ్త్ టూ వే డేటా లింక్ వ్యవస్థను ఈ ప్రయోగం విశ్లేషించిందని వివరించారు. ఇది ప్రత్యక్ష చిత్రాలను పైలట్‌కు పంపుతుందని, తద్వారా విమానంలోని పైలట్ రీ టార్గెట్ చేయడానికి వీలవుతుందని వెల్లడించారు.

# జాబిల్లి పైకి డ్రోన్..

## ప్రైవేటు కంపెనీ అరుదైన ప్రయోగం



**కేప్ కెనవెరాల్:** అంతరిక్ష రేసులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు అమెరికా కీలక చర్యలు చేపడుతోంది. మరోసారి మానవ సహిత జాబిల్లి యాత్ర చేపట్టేందుకు సిద్ధమైన నాసా.. అంతకంటే ముందు చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్‌కు వరుసగా ప్రయోగాలు చేస్తోంది. తాజాగా చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద దిగేలా ఓ ప్రైవేటు కంపెనీ అభివృద్ధి చేసిన లూనార్ ల్యాండర్‌ను ప్రయోగించింది. దీనిద్వారా జాబిల్లిపై సూర్య కిరణాలు ఎన్నడూ పడని ఓ బిలం పైకి డ్రోన్‌ను పంపించేందుకు ప్రణాళిక చేసింది. ఇంట్యూటివ్ మెషీన్స్ సంస్థ అభివృద్ధి చేసిన అథీనా ల్యాండర్‌ను స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్‌లో పంపించింది. నాసా కెన్నడీ స్పేస్‌సెంటర్ నుంచి దూసుకెళ్లిన ఈ రాకెట్.. మార్చి 6న చంద్రుడి ఉపరితలంపై దిగేలా రూపొందించారు. 15 అడుగుల ఎత్తైన ఈ అథీనా ల్యాండర్.. దక్షిణ ధ్రువానికి 100 మైళ్ల దూరంలో ల్యాండ్ అయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ ప్రాంతం జెట్ బ్లాక్ బిలానికి కేవలం 400 మీటర్ల దూరంలోనే ఉంటుంది. చంద్రుడిపై సూర్యకిరణాలు ఎన్నడూ పడని ప్రాంతంగా జెట్ బ్లాక్ బిలాన్ని అభివర్ణిస్తారు. ఈ బిలం పైకి 'గ్రేస్' అనే డ్రోన్‌ను పంపించడమే అథీనా ల్యాండర్ మిషన్ లక్ష్యం. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ దిగ్గజం గ్రేస్ హూపర్ గుర్తుగా ఈ డ్రోన్‌కు ఆయన పేరు పెట్టారు. మూడు అడుగులు ఉండే ఈ డ్రోన్.. జాబిల్లి ఉపరితలంపై మూడు కీలక పరీక్షలు నిర్వహించనుందట. ఇందులో హైడ్రోజన్ ఫ్యుయెల్డ్ థ్రస్టర్లను ఉపయోగించారు. దీంతో డ్రోన్ ఎగురుతుంది. నావిగేషన్ కోసం కెమెరా, లేజర్లను ఏర్పాటు చేశారు. డ్రోన్ ఎగురుతుండగా దీనిలోని పరికరాలు జాబిల్లి ఉపరితలాన్ని అన్వేషిస్తాయి.

# ఉక్రెయిన్ ఇక దాన్ని మర్చిపోవచ్చు

## నాటో సభ్యత్వంపై ట్రంప్



**అమెరికా : నాటోలో సభ్యత్వం విషయాన్ని ఉక్రెయిన్ మర్చిపోవచ్చని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఆయన అధికారం చేపట్టాక తొలిసారి తన కార్యవర్గంతో సమావేశమయ్యారు. దీనికి డోజ్ సారథి మస్క్ సహా పలువురు కీలక సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉక్రెయిన్ సమస్యపై ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.**

"నాటోనా..? దానిని మీరు మర్చిపోవచ్చు. అసలు ఈ సంక్షోభం మొత్తం దాంతోనే మొదలైంది. మేము అత్యుత్తమమైన పనే చేయాలనుకుంటున్నాం. ఇద్దరికీ బెస్ట్ డీల్ కుదురుస్తాం. ముఖ్యంగా ఉక్రెయిన్‌కు మంచి సంధి కుదిరేటట్లు చేసి.. కోల్పోయిన దానిలో.. వీలైనంత ఎక్కువ వెనక్కి ఇప్పిస్తాం" అని పేర్కొన్నారు. అదే సమయంలో శాంతి కోసం పుతిన్ కూడా కొన్ని రాయితీలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు ఖనిజాలపై అమెరికాతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు శుక్రవారం ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ వాషింగ్టన్‌లో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా వెల్లడించారు. "అది అరుదైన ఖనిజాలపై చేసుకొనే చాలా పెద్ద ఒప్పందం" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతకుమించి డీల్ గురించి ఆయన ఏమీ వెల్లడించలేదు. తొలుత ఈ డీల్‌కు అంగీకరించని ఉక్రెయిన్.. తాజాగా కొన్ని సవరణలతో ఆమోదించినట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా తమకు అమెరికా నుంచి సైనిక సాయం ఆగిపోకుండా చూసుకోవచ్చని ఉక్రెయిన్ ఆశిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ఏకకాలంలో ఉక్రెయిన్, రష్యాతో ఖనిజాలపై ఒప్పందాలు చేసుకొంటున్నారని డెమోక్రటిక్ పార్టీ సెనెట్ ఫారన్ రిలేషన్స్ కమిటీ సభ్యుడు జీన్ షహీన్ ఆరోపించారు. మూడేళ్లపాటు యుద్ధంలో చేసిన సాయానికి బదులుగా.. ఉక్రెయిన్ సగం అరుదైన ఖనిజాలను అమెరికాకు ఇవ్వాలని ట్రంప్ ఆ దేశాన్ని డిమాండ్ చేశారన్నారు. "నాకు తెలిసినంత వరకు దాదాపు 40-50శాతం ఉక్రెయిన్ ఖనిజాలు ఇప్పుడు రష్యా ఆక్రమణలో ఉన్న ప్రదేశాల్లో ఉన్నాయి. వాటికోసం ట్రంప్ పుతిన్‌తో కూడా డీల్ చేసుకొనే అవకాశం ఉంది. అది కొంచెం విచిత్రంగా ఉంటుంది. జీన్‌షహీన్ వన్ డెసిషన్ అనే పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.





వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చి

# చరిత్ర సృష్టిస్తాం

### టీవీకే అధ్యక్షుడు విజయ్



**చెన్నై : వచ్చే శాసనసభ ఎన్నికల్లో తమిళగ వెట్రికళగం(టీవీకే) అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు, తమిళ నటుడు విజయ్ ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా పూంజేరి గ్రామంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం టీవీకే రెండో వార్షిక ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది.**

ఇందులో ఆయన మాట్లాడుతూ.. నిధుల విడుదల వ్యవహారంలో తమిళనాడులోని డీఎంకే, కేంద్రంలోని భాజపా ప్రభుత్వాల వైఖరిపై ధ్వజమెత్తారు. భాష అనేది వ్యక్తిగతమని, దానిని బలవంతంగా రుద్దడం సమాఖ్య విధానానికి విరుద్ధమన్నారు. త్రిభాషా విధానాన్ని అమలు చేయకుంటే విద్యానిధులను మంజూరు చేయబోమని కేంద్రం చెబుతోందని విమర్శించారు. నిధులు ఇవ్వడం కేంద్రం బాధ్యత అని, వాటిని పొందడం రాష్ట్ర ప్రభుత్వ హక్కు అని తెలిపారు.

అయితే వారిద్దరూ (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) కీలకమైన భాషా విధానంపై ఎల్‌కేజీ, యూకేజీ పిల్లల తరహాలో 'ఎక్స్' వేదికగా కొట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు. వారు ఘర్షణ పడుతున్నట్లు నటిస్తే దానిని మనం నమ్మాలా అంటూ.. వాట్ బ్రో.. ఇట్స వెరీ రాంగ్ బ్రో అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజల డిమాండ్లను నెరవేర్చలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం నుంచి తప్పుకోవాలన్నారు. అసలైన సమస్యల నుంచి రాష్ట్ర ప్రజల దృష్టి మరల్చేందుకే భాజపా, డీఎంకే పరస్పర విమర్శలకు దిగుతున్నాయని ఆరోపించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ... క్రికెటర్ ధోనీ ప్రతిసారి చెన్నై సూపర్‌కింగ్స్ టీమ్ గెలుపులో కీలకపాత్ర పోషించారని, వచ్చే ఎన్నికల్లో టీవీకే గెలిస్తే పాపులారిటీలో తాను ధోనీని దాటేస్తానని అన్నారు. టీవీకేను గెలిపిస్తానని చెప్పడానికే వచ్చానన్నారు.

# వేడిగాలులను తట్టుకుని సురక్షితంగా ఉండటానికి 7 మార్గాలు



**ముంబైని వేడిగాలులు వణికిస్తుండటంతో, సురక్షితంగా మరియు ఆరోగ్యంగా ఉండటానికి జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. భారత వాతావరణ శాఖ (IMD) నివేదికల ప్రకారం, ఉష్ణోగ్రతలు 37-38 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగే అవకాశం ఉంది, దీని వలన ఈ ప్రాంతం కోసం హీట్ వేవ్ హెచ్చరిక జారీ చేయబడింది.ఇటువంటి తీవ్రమైన పరిస్థితులలో, వేడి అలసట మరియు వడదెబ్బ వంటి వేడి సంబంధిత అనారోగ్యాలను నివారించడానికి సురక్షితంగా మరియు హైడ్రేటెడ్ గా ఉండటం చాలా ముఖ్యం.వ్యాధి నియంత్రణ మరియు నివారణ కేంద్రాలు (CDC) ప్రకారం, తీవ్రమైన వేడి తీవ్రమైన వేడి సంబంధిత అనారోగ్యాలకు మరియు మరణానికి కూడా దారితీస్తుంది. శరీరం తనను తాను సరిగ్గా చల్లబరచడానికి కష్టపడుతున్నప్పుడు ఇది జరుగుతుంది. వృద్ధులు, చిన్నపిల్లలు మరియు దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు ఎక్కువ ప్రమాదంలో ఉన్నారు.వేడి సంబంధిత అనారోగ్యాలను నివారించడానికి CDC హైడ్రేటెడ్ గా ఉండటం, తేలికపాటి దుస్తులు ధరించడం మరియు గరిష్ట వేడి సమయంలో కఠినమైన కార్యకలాపాలకు దూరంగా ఉండటం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.**

ఉష్ణోగ్రతతో ఉండండి: మీకు దాహం అనిపించకపోయినా, పగటిపూట పుష్కలంగా నీరు త్రాగండి. కెఫిన్ మరియు చక్కెర కలిగిన పానీయాలను నివారించండి, ఎందుకంటే అవి శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తాయి. కొబ్బరి నీరు, నిమ్మరసం మరియు ఎలక్ట్రోలైట్ అధికంగా ఉండే ద్రవాలు హైడ్రేషన్‌ను నిర్వహించడానికి మరియు కోల్పోయిన ఖనిజాలను తిరిగి నింపడానికి సహాయపడతాయి.

పీక్ సమయాల్లో బయట ఉండకండి: మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య సూర్యుడు ఎక్కువగా ఉంటాడు. ఈ సమయంలో ఇంట్లోనే ఉండటానికి ప్రయత్నించండి, ముఖ్యంగా మీరు వృద్ధులు, గర్భవతి అయితే. మీరు బయటకు వెళ్లాల్సి వస్తే, గొడుగు తీసుకెళ్లండి లేదా రక్షణ కోసం వెడల్పు అంచుగల టోపీని ధరించండి.

స్మార్ట్‌గా దుస్తులు ధరించండి, తేలికగా దుస్తులు ధరించండి: చల్లగా ఉండటానికి కాటన్ మరియు లినెన్ వంటి వదులుగా, లేత రంగులో మరియు గాలి పీల్చుకునే బట్టలు ధరించండి. ముదురు రంగులు వేడిని గ్రహిస్తాయి, ఇది మిమ్మల్ని మరింత వెచ్చగా చేస్తుంది. సన్ గ్లాసెస్ మరియు %ఖ్రాఖీ% 30ం ఉన్న మంచి-నాణ్యత సన్‌స్క్రీన్ కూడా వడదెబ్బ నుండి రక్షించడంలో సహాయపడతాయి.

మీ స్థలాన్ని చల్లగా ఉంచండి: ప్రత్యక్ష సూర్యకాంతిని నిరోధించడానికి రోజులో అత్యంత వేడిగా ఉండే సమయంలో కర్టెన్లు లేదా బ్లైండ్‌లను మూసివేయండి. సౌకర్యవంతమైన ఇండోర్ ఉష్ణోగ్రతను నిర్వహించడానికి ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు లేదా ఎయిర్ కండిషనర్లను ఉపయోగించండి. గదిలో ఒక గిన్నె నీరు ఉంచడం లేదా మీ చర్మంపై తడిగా ఉన్న గుడ్డను ఉపయోగించడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది.భారతదేశంలో వేడిగాలులు వేడిగా మరియు పొడవుగా మారుతాయి, ఇప్పుడు సాధారణం కంటే రెట్టింపు అవుతాయి: రాబోయేది ఏమిటి. తాజాగా ఉండే తేలికపాటి ఆహారాన్ని తినండి: శరీరంలో ఎక్కువ వేడిని ఉత్పత్తి చేసే భారీ, జిడ్డుగల ఆహారాలకు బదులుగా చిన్న, తరచుగా భోజనం చేయండి. పుచ్చకాయ, దోసకాయ మరియు నారింజ వంటి తాజా పండ్లలో అధిక నీటి శాతం ఉంటుంది మరియు మిమ్మల్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. మిమ్మల్ని బద్ధకంగా భావించే కారంగా మరియు జిడ్డుగల ఆహారాలను నివారించండి.వేడి సంబంధిత అనారోగ్యానికి వ్యతిరేకంగా రక్షణ: తలతిరగడం, వికారం, అధిక చెమట మరియు కండరాల తిమ్మిరి వంటి వేడి అలసట సంకేతాల కోసం చూడండి. మీరు లేదా మీ చుట్టూ ఉన్న ఎవరైనా ఈ లక్షణాలను ఎదుర్కొంటే, చల్లని ప్రదేశానికి వెళ్లి, నీరు త్రాగండి మరియు విశ్రాంతి తీసుకోండి. హీట్ స్ట్రోక్ యొక్క తీవ్రమైన సందర్భాల్లో, వెంటనే వైద్య సహాయం తీసుకోండి.

చల్లని స్నానాలు మరియు తడి చుట్టలు తీసుకోండి: చల్లటి నీటితో త్వరగా స్నానం చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. చల్లగా ఉండటానికి మీరు మీ మెడ, మణికట్టు మరియు చీలమండలపై తడి గుడ్డను కూడా ఉంచవచ్చు. మీరు బయట ఉంటే, మీ ముఖం మరియు చేతులను తడి చేయడానికి నీటితో నిండిన స్ప్రే బాటిల్‌ను తీసుకెళ్లడం వల్ల తక్షణ ఉపశమనం లభిస్తుంది.

# 'కుంభమేళాలో అసౌకర్యానికి గురైతే క్షమించండి'

### భక్తులకు మోదీ సందేశం



**దిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు.**

"ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం".

"ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉంది" అని మోదీ రాసుకొచ్చారు.

ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. "ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా" అని మోదీ రాసుకొచ్చారు.

జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాల్లో

# పార్లమెంటు స్థానాలు తగ్గవు

### స్పష్టం చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా



**కోయంబత్తూరు : పునర్విభజన ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు స్థానాలు తగ్గవని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ఈశా కేంద్రంలో జరిగే శివరాత్రి వేడుకలో పాల్గొనేందుకు తమిళనాడులోని కోయంబత్తూరుకు వచ్చిన ఆయన.. బుధవారం స్థానిక భాజపా కార్యాలయాన్ని ప్రారంభించి ప్రసంగించారు.**

పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు ప్రజల్లో అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ ఇచ్చిన వాగ్దానం మేరకు దక్షిణ భారత రాష్ట్రాలకు ప్రోరేటా విధానంలో ఒక్క పార్లమెంటు సీటు కూడా తగ్గదని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు తాము అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. మరోపక్క నిధుల కేటాయింపులో తమిళనాడుకు అన్యాయం జరుగుతోందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోపించడం తగదన్నారు. మోదీ ప్రభుత్వం 2014-24 మధ్య రూ.5,08,337 కోట్లను ఇచ్చినట్లు వివరించారు.

తమిళనాడుకు అన్యాయం చేసింది అప్పటి యూపీఏ ప్రభుత్వమేనని మండిపడ్డారు. జాతీయ వ్యతిరేక ధోరణి ఇక్కడ తీవ్ర స్థాయిలో ఉందన్నారు. 1998లో కోయంబత్తూరులో చోటుచేసుకున్న బాంబుపేలుళ్ల కేసులో నిందితుడి అంత్యక్రియలను సైతం తమిళనాడు ప్రభుత్వం చేపట్టిందన్నారు. అవినీతిలో డీఎంకే నేతలు పట్టభద్రులయ్యారని ఆరోపించారు. డీఎంకే చరిత్రను చూస్తే అవినీతి ఉన్నవారినే పార్టీసభ్యులుగా మార్చే డ్రైవ్ కొనసాగుతున్నట్లు కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో యువతులకు భద్రత లేదని, అక్రమ మద్యం మీద మాట్లాడినందుకు కొందరు విద్యార్థులు హత్యలకు గురవుతున్నారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహారాష్ట్ర, హరియాణా కంటే ఘనంగా భాజపా తమిళనాడులో అధికారాన్ని చేజిక్కించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్రిభాషా విధానంపై తమిళనాడులో రాజకీయ దుమారం చెలరేగుతున్న నేపథ్యంలో ఆయన తమిళం అత్యంత ప్రాచీన భాష అని, ఆ భాషలో మాట్లాడలేకపోతున్నందుకు క్షమించండని అనడం గమనార్హం. కోయంబత్తూరులో భాజపా కార్యాలయాన్ని ప్రారంభించిన అమిత్‌షా.. ఆన్‌లైన్ ద్వారా తిరువణ్ణామలై, రామనాథపురం పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాజపా ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలోకి రానివ్వకుండా బారికేడ్లు

### ఆప్ ఎమ్మెల్యేల సంచలన ఆరోపణలు

**దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ సమావేశాల వేళ భాజపా సర్కారుపై ప్రతిపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ ప్రాంగణంలోకి రానివ్వకుండా బారికేడ్లు పెట్టి మరీ అడ్డుకుంటున్నారని ఆరోపించింది. ఈ మేరకు మాజీ సీఎం, శాసనసభలో ప్రతిపక్ష నేత ఆతిశీ ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు.**



"భాజపా నేతలు అధికారంలోకి రాగానే నియంతృత్వంలో అన్ని హద్దులు దాటేశారు. సభలో జై భీమ్ అని నినాదాలు చేసినందుకు మా పార్టీ ఎమ్మెల్యేలను మూడు రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఇప్పుడు విధాన సభ ప్రాంగణంలోకి రాకుండా మమ్మల్ని అడ్డుకుంటున్నారు. దిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదు" అని ఆమె దుయ్యబట్టారు.

మద్యం కుంభకోణంపై కాగ్ నివేదికను నిరసిస్తూ ఇటీవల ఆప్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఆతిశీ సహా 21 మంది ప్రతిపక్ష సభ్యులను మూడు రోజుల పాటు సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం ఆతిశీ సహా పలువురు ఆప్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వద్దకు రాగా.. పోలీసులు అడ్డుకున్నారు. స్పీకర్ ఉత్తర్వుల నేపథ్యంలో లోనికి వెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. దీంతో మాజీ సీఎం వారితో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఎక్స్ వేదికగా భాజపా సర్కారుపై విమర్శలు గుప్పించారు.

మద్యం కుంభకోణంపై గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ నివేదికలను భాజపా సర్కారు మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆమ్ ఆద్మీ ప్రభుత్వం హయాంలో 2021-22లో తీసుకొచ్చిన మద్యం విధానం కారణంగా దిల్లీ ప్రభుత్వానికి రూ.2000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ తేల్చింది. నిపుణుల అభిప్రాయాలు తీసుకోకపోవడం, ఫిర్యాదులు వచ్చినా బిడ్డింగును అనుమతించడం, ఉల్లంఘనలకు జరిమానా వేయకపోవడం, విధానాల రూపకల్పనలో పారదర్శకత లేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయని తెలిపింది. ఈ నివేదికను ఆప్ ఖండిస్తోంది.



తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com



# ఇంగ్లాండ్ ఓటమి..
## కన్నీరుపెట్టుకున్న మాజీ క్రికెటర్

**ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీలో అఫ్గానిస్థాన్ సత్తా చాటింది. గ్రూప్-బి మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. దీంతో తమ దేశం ఓటమి పాలవడంతో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ నీల్ ఫెయిర్‌బ్రదర్ కన్నీరు పెట్టుకున్నారు.**




లాహోర్ వేదికగా ఇంగ్లాండ్- అఫ్గానిస్థాన్‌ల మధ్య వర్చువల్ నాకౌట్ మ్యాచ్ జరిగింది. ఎనిమిది పరుగుల తేడాతో అఫ్గానిస్థాన్ విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం ఇంగ్లాండ్ ఓడిపోయిందంటూ స్నేహితుడు ఫెయిర్‌బ్రదర్‌కి, పాకిస్థాన్ క్రికెటర్ వసీం అక్రమ్ మెసేజ్ చేశాడు. అదివిని ఓటమితో కన్నీరు పెట్టుకున్నానని నీల్ ఫెయిర్‌బ్రదర్ తనతో చెప్పాడని అక్రమ్ తెలిపాడు. "ఇంగ్లాండ్ ఆట తీరుతో ఆ దేశ ప్రజలు ఎంతో కలత చెందారు. ఈ విషయం గురించి చెప్పినప్పుడు ఫెయిర్‌బ్రదర్ కంటతడి పెట్టుకున్నాడు. ఇది కేవలం ఆట మాత్రమేనని అతనికి ధైర్యం చెప్పాను" అని ఓ కార్యక్రమంలో అక్రమ్ వెల్లడించాడు.

**ఛాంపియన్స్ ట్రోఫీ.. సెమీ ఫైనల్‌లో భారత్**

**ప్రత్యర్థి ఎవరో?**

ఇంగ్లాండ్ జట్టు ఎంపికపై పాక్ క్రికెటర్ విమర్శలు గుప్పించాడు. కాగా.. భారీ ఛేదనలో ఇంగ్లాండ్ తడబడ్డా.. రూట్ పోరాటంతో చివరివరకూ ఆ జట్టును రేసులో నిలిపాడు. కానీ ఆఖరికి ఆ జట్టుకు నిరాశ తప్పలేదు. రూట్ (120బీ 111 బంతుల్లో 11ఐ4, 1ఐ6) అద్భుతంగా పోరాడినా.. ఇంగ్లాండ్ విజయానికి కొద్ది దూరంలోనే నిలిచిపోయింది. 49.5 ఓవర్లలో 317 పరుగులకు ఆలౌటైంది.

# మొత్తం జట్టును మార్చేయలేం: పాక్ కోచ్



**రావల్పిండి:** ఛాంపియన్స్ ట్రోఫీలో పేలవ ప్రదర్శనతో పాకిస్థాన్ జట్టు లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించడంపై ఆ జట్టు కోచ్ అకిబ్ జావెద్ స్పందించాడు. ఈ టోర్నీలో ఓటమి పాలైనంత మాత్రాన మొత్తం జట్టును మార్చేయలేమని అతనన్నాడు. "మెరుగైన ప్రదర్శన చేయకుండా ఏ ఆటగాడూ జట్టులోకి రాలేదు. ఈ టోర్నీలో ఓడిపోయామని మొత్తం జట్టును తప్పించి అండర్-19 ఆటగాళ్లతో భర్తీ చేయలేం. ఏ జట్టు విషయంలోనూ పూర్తి సంతృప్తి ఉండదు. ఉత్తమ ఆటగాళ్లతోనే జట్టును తీర్చిదిద్దడానికి ప్రయత్నించాం. సెలక్టర్లు కూడా అదే ఉద్దేశంతో పని చేశారు" అని అకిబ్ అన్నాడు. ఓపెనర్ సయిమ్ అయూబ్ టోర్నీకి దూరం కావడం, మధ్యలో ఫకార్ జమాన్ గాయపడడం తమకు చేటు చేసిందని అకిబ్ అభిప్రాయపడ్డాడు. "కొందరు కీలక ఆటగాళ్ల సేవలను కోల్పోయాం. సయిమ్, ఫకార్‌ల ప్రభావం మ్యాచ్‌ల్లో చాలా ఉంటుంది. వాళ్లిద్దరూ అందుబాటులో లేకపోవడంతో ఉన్న వనరులను బట్టి జట్టును ఎంచుకున్నాం. భారత్‌తో మ్యాచ్‌లో ఓడితే అభిమానులు ఎంత బాధ పడతారో తెలుసు. ఆటగాళ్ల అంతకుమించి ఆవేదన చెందుతారు" అని అతనన్నాడు.

# న్యూజిలాండ్‌తో మ్యాచ్..
## ప్రాక్టీస్‌కు దూరంగా రోహిత్, శుభ్‌మన్

ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించిన టీమ్ఇండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. అదే ఊపును ఆదివారం (మార్చి 2) న్యూజిలాండ్‌తో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లోను కొనసాగించాలనుకుంటోంది. ఈ మ్యాచ్ కోసం టీమ్ఇండియా బుధవారం ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంది. అయితే, కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం సాధనకు దూరంగా ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ఐసీసీ అకాడమీలో భారత ఆటగాళ్లు ఫుట్‌బాల్, రన్నింగ్ చేసి చెమటోడ్చుతుండగా, రోహిత్ మాత్రం కఠినమైన శారీరక కసరత్తులకు దూరంగా ఉన్నాడట. అతను స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ సోహం దేశాయ్ పర్యవేక్షణలో మెల్లగా జాగింగ్ చేసినట్లు తెలుస్తోంది. కానీ, రోహిత్ స్వేచ్ఛగా కదలడం లేదని జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి. భారత కెప్టెన్ ఎలాంటి త్రో డౌన్లు ఎదుర్కోకుండా కేవలం షాడో బ్యాటింగ్ చేస్తూ హెడ్ కోచ్ గంభీర్, ఇతర కోచింగ్ సిబ్బందితో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత కెప్టెన్ తొడ కండర గాయంతో బాధ పడ్డాడు. అయితే తాను బాగానే ఉన్నానని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పాక్‌తో మ్యాచ్ అనంతరం చెప్పాడు.



**శుభ్‌మన్ గిల్ కూడా**


ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్ కూడా ప్రాక్టీస్ సెషన్‌కు హాజరుకాలేదని సమాచారం. అతను హొటల్ రూమ్‌కే పరిమితమైనట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసిన గిల్ అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. రిషభ్ పంత్ జ్వరం నుంచి కోలుకొని బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఆటగాళ్ల ఫిట్‌నెస్ ఆందోళనల దృష్ట్యా న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో టీమ్ఇండియా తుది జట్టులో మార్పులు ఉండే అవకాశం ఉంది. కొంతమంది ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి ఇప్పటివరకు ఛాన్స్ రాని ప్లేయర్లను ప్లేయింగ్ ఎలెవన్‌లోకి

# ఫేవరెట్ ప్రజ్ఞానంద



**ప్రేగ్:** భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద ప్రేగ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో ఫేవరెట్‌గా బరిలో దిగుతున్నాడు. టాటా స్టీల్ మాస్టర్స్ టైటిల్ గెలుచుకుని జోరుమీదున్న ప్రజ్ఞానందకు ఈ టోర్నీలో రెండో సీడింగ్ దక్కింది. తొలి రౌండ్లో డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)తో ప్రజ్ఞానంద తలపడనున్నాడు. 10 మంది అగ్రశ్రేణి ఆటగాళ్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో 9 రౌండ్లు జరుగుతాయి. ప్రజ్ఞానంద 5 గేమ్‌ల్లో తెల్ల పావులతో ఆడనున్నాడు. మరో గేమ్‌లో నుయెన్ థాయ్ (చెక్ రిపబ్లిక్)తో అరవింద్ చిదంబరం పోటీపడనున్నాడు. విన్సెంట్ కీమెర్ (జర్మనీ)తో టాప్ సీడ్ వీ యి (చైనా), అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో లీ క్వాంగ్ లీమ్ (వియత్నాం), సామ్ షాంక్లాండ్ (అమెరికా)తో 16 ఏళ్ల గురెల్ ఎడిజ్ (తుర్కియె) తలపడనున్నారు. టోర్నీలో తొలి రౌండ్ గురువారం జరుగుతుంది.

# విజయం లేకుండా ముగింపు
## పాకిస్థాన్, బంగ్లాదేశ్ మ్యాచ్ వర్షార్పణం



**రావల్పిండి:**

**ఛాంపియన్స్ ట్రోఫీ ని ఆతిథ్య పాకిస్థాన్ ఒక్క విజయం లేకుండా ముగించింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆ జట్టు మొదటి రెండు మ్యాచ్‌ల్లో ఓడి లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. దీంతో బంగ్లాదేశ్‌తో చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచి పరువు కాపాడుకోవాలనుకున్న పాక్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. వర్షం కారణంగా పాక్, బంగ్లా మ్యాచ్ టాస్ పడకుండానే రద్దయింది.**

గురువారం రావల్పిండిలో ఉదయం నుంచి వర్షం కురిసింది. దీంతో మైదానమంతా చిత్తడిగా మారింది. ఔట్‌ఫీల్డ్ మొత్తం జలమయం అవడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేసిన అంపైర్లు.. ఇరు జట్లకు చెరో పాయింటు కేటాయించారు. పాకిస్థాన్‌తోపాటు బంగ్లాదేశ్ ఒక్క విజయం లేకుండానే టోర్నీని ముగించింది. మరోవైపు.. గ్రూప్ ఎ నుంచి భారత్, న్యూజిలాండ్ ఇప్పటికే సెమీస్‌కు చేరాయి. ఆదివారం టీమ్ఇండియా, కివీస్ మధ్య జరిగే పోరులో గెలిచిన జట్టు గ్రూప్-ఎలో అగ్రస్థానంలో నిలుస్తుంది. రావల్పిండిలో మంగళవారం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా వర్షార్పణమైన విషయం తెలిసిందే.

# డానిష్ సెంచరీ.. విదర్భ 254/4

**కేరళతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భకు శుభారంభం లభించింది. బుధవారం ఆరంభమైన మ్యాచ్‌లో డానిష్ మాలేవర్ (138 నాటౌట్‌బీ 259 బంతుల్లో 14ఐ4, 2ఐ6) అజేయ శతకం, కరుణ్ నాయర్ (86బీ 188 బంతుల్లో 8ఐ4, 1ఐ6) అర్ధసెంచరీతో సత్తాచాటడంతో విదర్భ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది.**



నాగ్‌పుర్: కేరళతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భకు శుభారంభం లభించింది. బుధవారం ఆరంభమైన మ్యాచ్‌లో డానిష్ మాలేవర్ (138 నాటౌట్‌బీ 259 బంతుల్లో 14ఐ4, 2ఐ6) అజేయ శతకం, కరుణ్ నాయర్ (86బీ 188 బంతుల్లో 8ఐ4, 1ఐ6) అర్ధసెంచరీతో సత్తాచాటడంతో విదర్భ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 4 వికెట్లకు 254 పరుగులు సాధించింది. నిజానికి టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న కేరళకు బౌలర్లు మంచి ఆరంభాన్నే అందించారు. పేసర్ నిధీశ్ (2/33) వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్ రెండో బంతికే ఓపెనర్ పార్థ్ రేఖడె (0) వికెట్ల ముందు దొరికిపోయాడు. అప్పటికి విదర్భ ఖాతా కూడా తెరవలేదు. కొద్దిసేపటికే నిధీశ్ బౌలింగ్‌లోనే దర్శన్ నాల్కండే (1) ఔటయ్యాడు. 11 పరుగులకే విదర్భ రెండు వికెట్లు నష్టపోయింది. క్రీజులో కుదురుకున్నట్లు కనిపించిన ధ్రువ్ షోరే (16)ను ఈడెన్ యాపిల్ టామ్ (1/66) వెనక్కి పంపాడు. దీంతో 24 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన విదర్భ పీకల్లోతు కష్టాల్లో చిక్కుకుంది. అయితే డానిష్, కరుణ్ జట్టుకు అండగా నిలిచారు. అద్భుతమైన భాగస్వామ్యంతో విదర్భను కష్టాల నుంచి గట్టెక్కించారు. ఈ క్రమంలోనే డానిష్ సెంచరీ సాధించాడు. కానీ సెంచరీ దిశగా పయనిస్తున్న కరుణ్‌ను రోహన్ కున్నుమ్మాల్ రనౌట్ చేశాడు. డానిష్, కరుణ్ నాలుగో వికెట్‌కు 215 పరుగులు (68.5 ఓవర్లలో) జోడించి విదర్భ భారీ స్కోరుకు బాటలు వేశారు.

# కింగ్‌స్టన్' ట్రైలర్ అవుట్




ప్రధాన నటుడిగా జి.వి.ప్రకాష్ యొక్క 25వ చిత్రం 'కింగ్స్టన్' కి నూతన దర్శకుడు కమల్ ప్రకాష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం సముద్ర ఫాంటసీ సాహస చిత్రం. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్ సినిమా యొక్క మిస్టీరియస్ మరియు థ్రిల్లింగ్ స్టోరీలైన్‌లో ఒక సంగ్రహావలోకనం అందిస్తుంది. ఈ సినిమా మార్చి 7న విడుదలకి సిద్ధంగా ఉంది. ప్రముఖ నటుడు మరియు స్వరకర్త అయిన జివి ప్రకాష్ 100 చిత్రాలకు పైగా సంగీతాన్ని అందించారు మరియు ఇప్పుడు ప్రధాన నటుడిగా తన 25వ ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకర్షించడానికి సిద్ధంగా ఉన్నారు. తాజాగా ఇప్పుడు ఈ సినిమా యొక్క ట్రైలర్ ని విడుదల చేసారు. ఈ సినిమాని తెలుగులో గంగ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ విడుదల చేస్తుంది. ఈ చిత్రంలో దివ్య భారతి, ఆంటోని, చేతన్, కుమారవేల్ మరియు సాబు మోహన్‌లతో సహా ఆకట్టుకునే సమిష్టి తారాగణం ఉంది. గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రఫీ సముద్రపు ఫాంటసీ ప్రపంచానికి జీవం పోస్తే, జివి ప్రకాష్ కుమార్ సంగీతం కథనానికి లోతును జోడించింది. ధివేక్ డైలాగ్స్ అందించగా, శాన్ లోకేష్ ఎడిటింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. %వా.వా%. మూర్తి యొక్క కళా దర్శకత్వం ప్రేక్షకులను కింగ్‌స్టన్ ప్రపంచంలోకి ఆకర్షిస్తూ లీనమయ్యే వాతావరణాన్ని సృష్టిస్తుంది. కింగ్‌స్టన్ దాని ప్రత్యేకమైన సీ ఫాంటసీ కాన్సెప్ట్‌తో జి.వి.ప్రకాష్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. జీ స్టూడియోస్ మరియు ప్యారలల్ యూనివర్స్ బ్యానర్ల ద్వారా నిర్మించిన కింగ్‌స్టన్ చిత్రం మార్చి 7న విడుదల కానుంది.

# జూన్‌లో కుబేర చిత్రం విడుదల?




**టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'కుబేర'. ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో అక్కినేని నాగార్జున, తమిళ హీరో ధనుశ్ నటిస్తున్నారు. అలాగే రష్మిక మందన్న కీలక పాత్ర పోషిస్తోంది. అయితే, తాజాగా ఈ చిత్రం రిలీజ్ డేట్ ఖరారైంది. కుబేర' చిత్రానికి సంబంధించిన తాజా పోస్టర్ ద్వారా ఈ చిత్రం విడుదల తేదీని జూన్ 20గా ప్రకటించారు. ఈ చిత్రం ఒక కొత్త సోషల్ డ్రామా కథాంశంతో రూపొందించబడింది. చిత్రంలో ధనుశ్ పాత్ర చాలా కొత్తగా కనిపించనుందని టాక్. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను శ్రీవెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌లో సునీల్ నారంగ్, రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఇక ఇప్పటికే సినిమా నుంచి నాగార్జున, ధనుశ్, రష్మిక ఫస్ట్ లుక్ పోస్టర్లు విడుదల చేశారు. అలాగే రష్మిక క్యారెక్టర్ గ్లింప్స్ తో పాటు టీజర్ కూడా విడుదలైంది.**

**సినిమా కథాంశం** శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న 'కుబేర' సినిమా, పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోంది. ఈ సినిమాలో అక్కినేని నాగార్జున, ధనుశ్, రష్మిక మందన్న ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. ఈ చిత్రం ఒక కొత్త సోషియల్ డ్రామా కథాంశంతో తెరకెక్కుతున్నట్లు సమాచారం. 'కుబేర' సినిమా కథ ఒక సామాన్య వ్యక్తి కోసం పోరాడే ప్రతిష్టిత, ధనవంతుడైన కుబేరుడి గురించి ఉంది. ఈ కుబేరుడు సొంత ప్రయత్నంతో బాగా సంపాదించిన వ్యక్తి, కానీ తన సంపదను సమాజం కోసం ఉపయోగించడం లేదా తన వ్యక్తిగత జీవితంలో కష్టాలు ఎదుర్కొనే విషయంలో అతను ఏమి నిర్ణయించుకుంటాడనే దానిపై కథ ఆధారపడింది.

**ధనుశ్ పాత్ర** ధనుశ్ ఈ సినిమాలో ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్ర అనేది కుబేరుడిగా, ఓ వ్యక్తి తన సంపదను తన కుటుంబం, సమాజం మరియు వ్యక్తిగత జీవితంలో సరైన విధంగా ఉపయోగించుకోవాలని ఎదుర్కొంటున్న వివిధ ఒత్తిడులు మరియు చాంజిలి అయిన ప్రశ్నలు. ధనుశ్ పాత్ర కొన్ని సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ, మరింత ఉన్నతమైన మార్గాన్ని చూపిస్తుంది.


**నాగార్జున పాత్ర** నాగార్జున ఈ సినిమాలో మరో ముఖ్యమైన పాత్రలో కనిపిస్తారు. ఆయన పాత్ర, పెద్ద పేరు సంపాదించిన, కానీ తన జీవితం ఇంకా పూర్తి స్థాయిలో జీవించని వ్యక్తిగా ఉంటుంది. ఆయన పాత్రలో పెద్ద సామాజిక బాధ్యతలు, వ్యవహారాలు మరియు తన కుటుంబంతో సంబంధాలు ఉంటాయి.

**రష్మిక మందన్న పాత్ర** రష్మిక మందన్న ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమె పాత్ర, ఒక యువతి గా, కుబేరుడితో సంబంధం పెరిగిన ఒక మహిళా పాత్ర. ఆమె పాత్రలో వ్యక్తిగత సమస్యలు మరియు తన విలువలను ప్రేమలో ఎలా ధైర్యంగా నడిపిస్తుందనే అంశాలు ఉంటాయి. ఆమె పాత్ర కథలో చాలా కీలకంగా మారుతుంది.

**సంగీతం** సినిమా సంగీతం రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ అందించారు, ఆయన సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేకమైన స్పెషల్ టచ్ ఇస్తుంది. సంగీతం కథకు జీవాన్ని పోసి, సినిమా భావోద్వేగాలను మరింత ప్రబలంగా చేస్తుంది.

**సినిమా సందేశం** 'కుబేర' సినిమా ఒక వ్యక్తి ఆర్థిక, సామాజిక మరియు కుటుంబ బాధ్యతల మధ్య పోరాడుతూ, తన తలపులతో ఎలా యుద్ధం చేయాలనే అంశాన్ని చూపిస్తుంది. ఇది నేటి సమాజంలో ఉన్న సామాజిక వ్యవస్థను, కుటుంబ సంబంధాలను ప్రతిబింబిస్తూ, సుస్థిరత, ధైర్యం, ప్రేమ మరియు సమాజ సేవకు సంబంధించిన విలువలను ప్రతిష్టించి స్ఫూర్తిని కలిగిస్తుంది.

# 'కూలీ' సినిమాలో పూజా హెగ్డే ఫస్ట్ లుక్




పూజా హెగ్డే ప్రారంభంగా మోడలింగ్ రంగంలో ప్రవేశించి అక్కడ మంచి పేరు సంపాదించింది. ఆ సమయంలోనే ఆమె 'మిస్ యునైటెడ్ కింగ్‌డమ్' పునర్నిర్మాణం పోటీలో పాల్గొని విజేతగా నిలిచింది. పూజా హెగ్డే మోడలింగ్ రంగంలో మంచి గుర్తింపు పొందిన తరువాత, ఆమె సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టింది. టాలీవుడ్ లో కొంత కాలం క్రితం అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్‌గా నిలిచిన పూజా హెగ్డే, ప్రస్తుతం తమిళ్ లో పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో దూసుకెళ్ళిపోతుంది. తాజాగా, ఆమెకు తమిళ్ లో సరికొత్త అవకాశాలు వచ్చినట్టు తెలుస్తోంది. రజనీ కాంత్, విజయ్ వంటి కోలీవుడ్ స్టార్‌లతో పలు సినిమాల్లో ఆమె నటించనున్నారు.

**రజనీ కాంత్, లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' సినిమా**

పూజా హెగ్డే కోలీవుడ్ లో తన సత్తా మళ్లీ చాటుకుంది. రజనీ కాంత్ నటించిన, ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కూలీ' సినిమా కోసం పూజా హెగ్డే ఓ ఐటెం సాంగ్‌లో పాల్గొనబోతోంది. ఈ సినిమాలో ఆమె ఫస్ట్ లుక్ కూడా విడుదలైంది. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శృతిహాసన్ వంటి కోలీవుడ్ ప్రముఖులు కూడా ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

**'నాయగన్' సినిమాలో విజయ్ సరసన పూజా హెగ్డే**

తమిళ్ లో పూజా హెగ్డే మరో భారీ సినిమా సంతకం చేసింది. కోలీవుడ్ స్టార్ విజయ్ సరసన ఆమె 'నాయగన్' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా కూడా కోలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా, పూజా కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశముంది.

**పూజా హెగ్డేకు టాలీవుడ్ లో తగ్గిన అవకాశాలు**

టాలీవుడ్ లో పూజా హెగ్డేకి అంచనాలకు తగ్గట్టు ఆఫర్లు తగ్గాయి. కొంతకాలంగా ఆమె ఆఫర్లు మళ్లీ తగ్గుతున్నా, తమిళ్ లో ఆమెకు ఆఫర్లు పెరుగుతున్నాయి. తెలుగు చిత్రసీమలో ఆమె ప్రధాన పాత్రల్లో కనిపించిన సినిమాలు కొంతకాలంగా నిరాశాజనకంగా నిలిచాయి, కానీ కోలీవుడ్ లో ఆమెకు అవకాశాలు అందుతున్నాయి.

**తమిళ్ సినిమా పరిశ్రమలో పూజా హెగ్డే పెరుగుతున్న క్రేజ్**


టాలీవుడ్ లో తక్కువ అవకాశాలు ఉన్నప్పటికీ, తమిళ్ పరిశ్రమలో పూజా హెగ్డేకు పెరుగుతున్న క్రేజ్ స్పష్టంగా కనిపిస్తోంది. రజనీ కాంత్, విజయ్ వంటి అగ్ర నటులతో ఆమె నటించడం, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు అవకాశాన్ని ఇస్తుంది. పూజా హెగ్డే టాలెంట్ మరియు అందంతో కోలీవుడ్ లో మంచి గుర్తింపు పొందింది.

**పూజా హెగ్డేకు నెక్స్ట్ ప్లాన్స్**

పూజా హెగ్డే తన కెరీర్ లో కొత్త మార్గాలను అన్వేషించేందుకు సిద్ధంగా ఉంది. టాలీవుడ్ లో నిరాశ వచ్చినా, ఆమె తన ప్రయాణం కోలీవుడ్ తో కొనసాగించనుంది. తమిళ్ సినిమాల్లో జోరు చూపుతున్న ఆమె, త్వరలో మరిన్ని విజయాలు సాధించడానికి సిద్ధంగా ఉంటుంది.


**ప్రత్యేకతలు:** పూజా హెగ్డే సినీ పరిశ్రమలో ఎంతో పలు ప్రత్యేకతలను తీసుకువచ్చింది. ఆమె తన నటనతో ప్రేక్షకుల హృదయాలను దోచుకుంది. అనేక ఆఫర్లు వచ్చినా, ఆమె ఎప్పటికప్పుడు తన వినోదాన్ని, పంచ్‌లను ప్రేక్షకులకు అందించడానికి యత్నించాయి

# మార్చి 1వ తేదీన ఓటీటీలోకి 'సంక్రాంతికి వస్తున్నాం'



వెంకటేశ్ ప్రధాన పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం ఓటీటీ విడుదల తేదీని జీ5 సంస్థ ప్రకటించింది. ఈ చిత్రాన్ని జీ తెలుగు ఛానల్‌లో ప్రసారం చేయనున్నట్లు ఇదివరకే వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే, ఓటీటీ విడుదల తేదీపై ప్రకటన రాలేదు. ఇప్పుడు ఓటీటీ విడుదల తేదీ కూడా ఖరారైంది.మార్చి 1వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు జీ తెలుగు ఛానల్‌తో పాటు జీ5 ఓటీటీలోనూ ఈ చిత్రం ఒకేసారి అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని జీ5 సంస్థ తాజాగా తన యాప్‌లో విడుదల చేసిన ప్రత్యేక ప్రోమో ద్వారా తెలియజేసింది.'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు ట్రేడ్ వర్గాల అంచనా. ఇదిలా ఉండగా, ఈ సినిమాకు సంబంధించి మరొక వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమా నిడివిని దృష్టిలో ఉంచుకొని తొలగించిన కొన్ని హాస్య సన్నివేశాలను ఓటీటీ వెర్షన్‌లో జత చేయాలని దర్శకుడు అనిల్ రావిపూడి భావిస్తున్నట్లు సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# నేడు విడుదలకి సిద్ధంగా ఉన్న 'శబ్దం'





అరివళగన్ దర్శకత్వంలో యంగ్ హీరో ఆది పినిశెట్టి నటించిన హారర్ థ్రిల్లర్ 'శబ్దం' ఫిబ్రవరి 28న విడుదల కానుంది. ఈ తమిళ తెలుగు ద్విభాషా చిత్రంని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి నైజాంలో తెలుగులో విడుదల చేస్తుంది. లక్ష్మీ మీనన్, లైలా మరియు సిమ్రాన్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాలో ఒక మహిళ ఆత్మహత్యతో ప్రేరేపించబడిన కళాశాలలోని వింత సంఘటనలను పరిశోధించే ఉపాధ్యాయునిగా ఆది నటించాడు. 7%+% ఫిల్మ్స్ మరియు ఆల్ఫా ఫ్రేమ్‌ల మద్దతుతో అరివళగన్ యొక్క ప్రొడక్షన్ వెంచర్ ప్రతిభావంతులైన సాంకేతిక సిబ్బందిని కలిగి ఉంది. ఎస్ థమన్ సంగీతం సమకూరుస్తుండగా, అరుణ్ బత్మనాబన్ సినిమాటోగ్రఫీని, సాబు జోసెఫ్ విజె ఎడిట్ చేస్తున్నారు.

# 3న ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవం



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న 97వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవం మార్చి 2న (భారత కాలమానం ప్రకారం మార్చి 3న) అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో జరగనుంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పురస్కారాన్ని సొంతం చేసుకోవటానికి పలువురు నటీనటులు, దర్శకులు పోటీపడ్డారు. 1968 తర్వాత సంగీత నేపథ్యం ఉన్న రెండు సినిమాలు వికెడ్, ఎమిలియా పెరెజ్ ఆస్కార్‌కు నామినేట్ అయ్యాయి. ఆస్కార్ చరిత్రలో రెండు మ్యూజికల్ బ్యాక్‌డ్రాప్ ఉన్న చిత్రాలు 10 లేదా అంత కంటే ఎక్కువ కేటగిరీల్లో నామినేట్ కావటం ఇది రెండోసారి. మొత్తం నామినేషన్లలో రేసులో ఎమిలియా పెరేజ్ 13 విభాగాల్లో ముందంజలో ఉంది. ఉత్తమ దర్శకుడు, రచనా విభాగంలో నామినేట్ కాకుండా 10 కేటగిరీల్లో నామినేషన్లు అందుకున్న మొదటి చిత్రంగా వికెడ్ రికార్డు సృష్టించింది. ఎమిలియా పెరెజ్ సినిమాను జాక్వెస్ ఆడియార్డ్ తెరకెక్కించారు. పరిస్థితుల కారణంగా ట్రాన్స్‌జెండర్‌గా మారిన ఓ డ్రగ్స్ లార్డ్ అనుభవాల్ని తెరపై కళ్లకు కట్టినట్లుగా చూపించటంలో ఆయన విజయవంతం కావటంతో దర్శకుడి విభాగంలో ఆయన నామినేట్ అయ్యారు. హాలీవుడ్ నటి కర్లా సోఫియాగాస్కాన్ ఉత్తమ నటిగా నామినేషన్ దక్కించుకున్నారు. అండర్ వరల్డ్ డ్రగ్స్ నేపథ్యంలో సాగే 'ఎమిలియా పెరెజ్' చిత్రానికిగాను ఆమె ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ ఏడాది ఆస్కార్ బరిలో నిలిచిన మొదటి ట్రాన్స్‌జెండర్ కూడా ఆమె. ఫెర్నాండా టోర్రెస్ నటించిన ఐయామ్ స్టిల్ హియర్ నామినేషన్ దక్కించుకున్నారు. ఫెర్నాండా టోర్రెస్ కూడా పోటీపడుతున్నారు. ఉత్తమ సహాయనటుడి విభాగంలో కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), జెరీమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ఇదే మొట్టమొదటి ఆస్కార్ నామినేషన్.

# 25ఎం వ్యూస్‌ని సొంతం చేసుకున్న 'హిట్ 3' టీజర్




టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని ఇటీవలే తన 32వ చిత్రాన్ని ప్రకటించారు. ఈ చిత్రానికి మూవీ మేకర్స్ హిట్: ది 3వ కేసు అనే టైటిల్ ని లాక్ చేసారు. గతంలో హిట్ ఫ్రాంచైజీకి దర్శకత్వం చేసిన డాక్టర్ శైలేష్ కొలను ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. హిట్: 3వ కేసు మరింత ప్రతిష్టాత్మకంగా ఉంటుందని అంచనా వేయబడింది. ఈ సినిమాను కూడా నాని తన హోమ్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం నాని భారీగానే ఖర్చు చేస్తున్నాడని ఇప్పుడు తెలిసింది. చిత్ర బృందం ఈ సినిమా యొక్క టీజర్ ని ఇటీవలే విడుదల చేసారు. తాజాగా ఇప్పుడు ఈ సినిమా టీజర్ 25 మిలియన్ వ్యూస్ తో యూట్యూబ్ లో ట్రేండింగ్ లో ఉన్నట్లు మూవీ మేకర్స్ ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేసేందుకు చిత్ర బృందం సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసారు. ఈ సినిమాలో నాని సరసన కథానాయికగా కెజిఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి నటిస్తోంది. సాంకేతిక బృందంలో రచయిత మరియు దర్శకుడు డా. శైలేష్ కొలను, నిర్మాత ప్రశాంతి తిపిర్నేని మరియు బ్యానర్లు వాల్ పోస్టర్ సినిమా మరియు యునానిమస్ ప్రొడక్షన్స్ ఉన్నారు. మే 1, 2025న హిట్ 3 విడుదల కానుంది. మిక్కీ జె మేయర్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్‌గా కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్ శ్రీ నాగేంద్ర తంగల ఉన్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339